**నేటి కందం-నేటికి అందం**

కార్పెంటరు పుత్రికయై
కార్పోరేట్లో చదవక కందుల జెస్సీ
కూర్పుంబడి జ్ఞానముతో
నేర్పరియై ప్రపంచమున నిలచె యశముతోన్ !!

(ప్రభుత్వ బడిలో చదువుకునే పేద కార్పెంటర్ కూతురు కందుల జెస్సీ అంతర్జాతీయ లూనార్ క్యూబ్ శాట్ మిషన్ లో ప్రపంచ స్థాయిలో ఎన్నికై భారత దేశానికీ, తెలుగు వారికీ గర్వకారణంగా నిలిచింది.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

**చురక**

ఎన్ఎస్ఏ చట్ట ఉచ్చు
ఎందుకొరకు తగిలిస్తరు
కాక్రోచ్ ల ఉద్యమాన్ని
కాలికింద నలిపేస్తరు.
న్యాయమడిగి నిరసిస్తే
నేరస్తులు ఎట్లవుతరు
జాతీయ భద్రతకు
జెన్ జీ లు ముప్పవుతరు.



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శనివారం 25-7-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:275 పేజీలు:6 వెల: రూ.1/-


# లీకేజీలకు పాల్పడితే ఇక అంతే..

## నేటి కేంద్ర కేబినెట్‌లో కీలక నిర్ణయాలు!



న్యూ ఢిల్లీ, జులై 24::NEET, JEE వంటి పోటీ పరీక్షల్లో వరుస పేపర్ లీకేజీలు, అక్రమాలపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమైంది. పేపర్ లీకేజీలకు పాల్పడే వ్యవస్థీకృత గ్యాంగ్‌లు, నిందితులపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలుగా 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్, 2024' చట్టానికి సవరణలు చేసేందుకు ఇవాళ్టి కేంద్ర కేబినెట్ భేటీలో చర్చించనున్నారు.

**ప్రతిపాదిత కొత్త సవరణలు:**

సుదీర్ఘ జైలు శిక్షలు, భారీ జరిమానాలు: ప్రస్తుతం ఉన్న జైలు శిక్షా కాలాన్ని మరింత పెంచడంతో పాటు, ఆర్థిక జరిమానాలను భారీగా పెంచేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

కాలపరిమితితో కూడిన విచారణ (Time-Bound Trials): పేపర్ లీకేజీ కేసుల విచారణ ఏళ్ల తరబడి సాగకుండా, ఏడాది లేదా అంతకంటే తక్కువ వ్యవధిలోనే విచారణ పూర్తిచేసి బాధ్యులకు వేగంగా శిక్ష పడేలా నిబంధనలు తీసురానున్నారు.

ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టులు: విచారణను వేగవంతం చేయడానికి ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని మోదీ ఇప్పటికే ప్రకటించారు.

ప్రస్తుతం ఉన్న చట్టం ఏం చెబుతోంది

2024 జూన్‌లో తీసుకొచ్చిన చట్టం ప్రకారం.. వ్యక్తిగతంగా అక్రమాలకు పాల్పడితే 3 నుంచి 5 ఏళ్ల జైలు శిక్ష, రూ. 10 లక్షల వరకు జరిమానా విధిస్తారు. అదే గ్యాంగ్‌లు/వ్యవస్థీకృత నెట్‌వర్క్‌గా లీకేజీలకు పాల్పడితే 5 నుంచి 10 ఏళ్ల జైలు శిక్ష, రూ. 1 కోటి వరకు జరిమానా విధించే నిబంధన ఉంది. ఇప్పుడు ఈ శిక్షలను మరింత కఠినతరం చేయనున్నారు.

మరొకవైపు, పరీక్షల విధానంలో సంస్కరణలు, నీట్ లీకేజీపై విచారణ డిమాండ్‌తో 26 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ప్రముఖ సామాజిక వేత్త సోనమ్ వాంగ్‌చుక్ గురువారం రాత్రి తన దీక్షను విరమించారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లు గుర్గావ్‌లోని మేదాంత ఆసుపత్రిలో ఆయనను కలిసి ప్రభుత్వం తరఫున హామీ పత్రాన్ని అందజేశారు.

**ప్రభుత్వం ఇచ్చే ప్రధాన హామీలు:**


సభలో విస్తృత చర్చ: ఈ పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో పేపర్ లీకేజీలు, విద్యా సంస్కరణలపై సమగ్ర చర్చ జరుపు తామని హామీ ఇచ్చారు.

మృతుల కుటుంబాలకు నష్టపరిహారం: నీట్ పేపర్ లీక్ ఆవేదనతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు తగిన పరిహారం అందించేందుకు సానుకూలంగా ఉన్నట్లు తెలిపారు.

శాంతియుత నిరసనకారులపై కేసులు నమోదు చేయరు: శాంతియుతంగా ఆందోళన తెలిపిన విద్యార్థులు, యువతపై ఎలాంటి కేసులు పెట్టబోమని రాతపూర్వకంగా హామీ ఇచ్చారు. సభలో విపక్షాల ఆందోళనలు, బయట విద్యార్థుల నిరసనల నడుమ కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని మరింత కఠినతరం చేయడం ద్వారా విద్యార్థుల్లో, తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పునరుద్ధరించేందుకు వేగంగా అడుగులు వేస్తోంది.

# విద్యార్థులను బెదిరించకండి..


## ఢిల్లీ వర్సిటీ వార్నింగ్‌పై రాహుల్ గాంధీ





న్యూఢిల్లీ, జులై 24:జంతర్‌మంతర్‌లో జరుగుతున్న సీజేపీ నిరసనల నేపథ్యంలో ఢిల్లీ యూనివర్సిటీ తమ విద్యార్థులకు అడ్వైజరీ జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ నిరసన ప్రదర్శల్లో స్టూడెంట్స్ పాల్గోవద్దు అని ఢిల్లీ వర్సిటీ తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నది. ఈ నేపథ్యంలో ఇవాళ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ (ఖీజీష్త్రబీశ్రీ ఉజీనిటష్త్రతి) స్పందించారు. ప్రజాస్వామ్య హక్కులను అమలు చేస్తున్న విద్యార్థులను ఎందుకు బెదిరిస్తున్నారని రాహుల్ అన్నారు. సమయం వచ్చినప్పుడు దీనికి మీరే బాధ్యులు అవుతారని ఆయన వర్సిటీకి హెచ్చరిక చేశారు. జంతర్ మంతర్‌లో జరిగే నిరసన ప్రదర్శనకు వెళ్లవద్దు అంటూ ఢిల్లీ వర్సిటీ విద్యార్థులకు అడ్వైజరీ జారీ చేసింది. ఇలాంటి నిరసనల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల భద్రత ప్రమాదంలో పడుతుందని వర్సిటీ తన వార్నింగ్‌లో పేర్కొన్నది. నకిలీ, తప్పుడు కాంటెంట్‌ను సర్క్యులేట్ చేస్తుంటారని, దీని వల్ల విద్యార్థులకు సమస్యలు రావొచ్చు అని వర్సిటీ తెలిపింది. ఢిల్లీ వర్సిటీ ఆదేశాలను లోక్‌సభ ఎంపీ దీపేంద్ర సింగ్ హుడా వ్యతిరేకించారు.

# ఉద్యోగ, ఉపాధికి దగ్గరగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జులై 24: క్యూర్ పరిధిలో చేపట్టనున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు(శుక్రవారం) సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించి ఇళ్ల నిర్మాణానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్(ఓఆర్ఆర్) లోపల ఉన్న ఖాళీ ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దగ్గరగా ఉండే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను గృహ నిర్మాణం కోసం వినియోగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

మొదటి విడతలో 17 నియోజకవర్గాల్లో మొత్తం 7,680 ఇందిరమ్మ ఫ్లాట్లను నిర్మించనున్నట్లు సీఎం వెల్లడించారు. 528 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం జరుగనుందన్నారు. ఒక్కో ఫ్లాట్ నిర్మాణానికి సుమారు రూ.11 లక్షల వ్యయం అవుతుందని, ఇందులో ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తుందని చెప్పారు. భూమి వ్యయాన్ని(ల్యాండ్ కాస్ట్) పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. ఖాళీ ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిరుపేదలకు నగరానికి చేరువలోనే గృహాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ ఉభయసభల్లో విపక్షాల ఆందోళన..



న్యూఢిల్లీ, జులై 24: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ చేస్తూ ఇవాళ విపక్షాలు పార్లమెంట్‌లో ఆందోళన చేపట్టాయి. నీట్ పేపర్ లీకేజీ ఘటన నేపథ్యంలో విపక్షాలు ఈ డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. లోక్‌సభ, రాజ్యసభలోనూ ఇదే సీన్ రిపీటైంది. లోక్‌సభలో విపక్ష ఎంపీలతో పాటు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ప్రధాన్ రాజీనామా కోరుతూ సభలో నినాదాలు చేశారు. విపక్ష ఎంపీలు తగ్గకపోవడంతో.. సభను స్పీకర్ రేపటికి వాయిదా వేశారు. మళ్లీ సోమవారం లోక్‌సభ సమావేశంకానున్నది.

మరో వైపు రాజ్యసభ ఇవాళ మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా పడింది. నీట్ పేపర్ లీక్ అంశంపై ఇవాళ విపక్షలు చర్చకు పట్టుపట్టాయి. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ చేశారు. తొలుత 12 గంటలకు సభ వాయిదా వేశారు. ఆ తర్వాత మళ్లీ విపక్ష సభ్యులు ప్రధాన్ రాజీనామాకు పట్టుపట్టారు. దీంతో 2 గంటల వరకు వాయిదా వేశారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు.

లోక్‌సభలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడారు.

నీట్‌పై చర్చ జరగాలని విపక్షాలతో చెప్పానని, దేశ ప్రజలకు ప్రధాని మోదీ హామీ ఇచ్చారని, సోనమ్ వాంగ్‌చెక్ తన నిరాహార దీక్షను విరమించారని, ఆయన కూడా సభలో చర్చ జరగాలని ఆశించారని, ఒకవేళ ఇప్పుడు చర్చ చేపట్టకుంటే, అది సరైన సందేశాన్ని ఇవ్వబోదు అని మంత్రి రిజిజు అన్నారు.

# జీహెచ్ఎంసీ తాగునీటి సరఫరాపై సీఎం రేవంత్ సమీక్ష



హైదరాబాద్, జులై 24: గ్రేటర్ హైదరాబాద్‌లో తాగునీటి సరఫరా మెరుగుదలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో జీహెచ్ఎంసీ పరిధిలో తాగునీటి సరఫరాపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఆయన, ప్రస్తుతం మూడు, నాలుగు రోజులకు ఒకసారి నీరు అందుతున్న ప్రాంతాల్లో ఇకపై రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి ఎత్తిపోతలలో ఎలాంటి జాప్యం లేకుండా, దీర్ఘకాలంగా సమస్యలు ఎదుర్కొంటున్న ప్రాంతాలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (అజఖీఇ) పరిధిలో వచ్చే 50 ఏళ్ల తాగునీటి అవసరాలకు అనుగుణంగా సమగ్ర మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని సీఎం ఆదేశించారు. నగర పరిసర ప్రాంతాల్లోని అన్ని తాగునీటి వనరులను పరస్పరం అనుసంధానించి, ఒక వనరులో సమస్య ఏర్పడితే మరో వనరు నుంచి నీటి సరఫరా కొనసాగేలా వ్యవస్థను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న తాగునీటి ప్రాజెక్టులను 18 నెలల్లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే గృహాల నుంచి వచ్చే గ్రే వాటర్‌ను పరిశ్రమలు, నిర్మాణ రంగ అవసరాలకు వినియోగించేలా ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

# కొల్లాపూర్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన మంత్రి జూపల్లి

**-అర్హులైన ప్రతి ఓటరు గడువులోగా ఫారం సమర్పించాలని పిలుపు**

**ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం**



మహబూబ్‌నగర్, జులై 24:కొల్లాపూర్‌లో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం స్వయంగా పరిశీలించారు. వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను సందర్శించి ఓటర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఫారాల పంపిణీ, స్వీకరణ, నమోదు ప్రక్రియపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా నింపి గడువులోగా సమర్పించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు.

బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) పూర్తి సమన్వయంతో పనిచేసి అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చూడాలని ఆదేశించారు. ఫారాల పంపిణీ, స్వీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.

ఇళ్ల వద్ద అందుబాటులో లేని ఓటర్లను ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలు సేకరించి ఫారాలు అందజేయాలని, అందుబాటులో లేని ఓటర్ల వివరాలను వెంటనే సూపర్వైజర్ల దృష్టికి తీసుకెళ్లాలని అధికారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. ప్రజాస్వామ్యానికి ప్రతి ఓటు కీలకమని, ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతం చేయడం అందరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

# ఇందిరా పార్క్ వద్ద బీఆర్ఎస్వీ పోరుబాట..

## నల్లచొక్కాతో హాజరైన కేటీఆర్



హైదరాబాద్, జులై 24: ఢిల్లీలో విద్యార్థుల పోరాటానికి మద్దతుగా బీఆర్ఎస్ పోరు బాట పట్టింది. దేశ రాజధానిలో విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. బర్త్ డే వేడుకలను సైతం రద్దు చేసుకుని, నల్ల చొక్కాతో ఆయన నిరసన పాల్గొన్నారు. బిఆర్ఎస్ పిలుపు మేరకు ఇందిరా పార్క్ వద్దకు విద్యార్థులు ఉప్పెనలా తరలివచ్చారు.

విద్యార్థులకు అండగా కేటీఆర్ తన 50వ పుట్టిన రోజు వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్న కేటీఆర్ విద్యార్థి ఉద్యమానికి అండగా నిలిచారు. హైదరాబాద్ వేదికగా తలపెట్టిన నిరసనలో ప్రత్యక్షంగా పాల్గొనాలని సంకల్పించారు.

కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు విద్యార్థులు, నిరుద్యోగులకు చేస్తున్న అన్యాయాలను ఎలుగెత్తి చాటనున్నారు. నాడు ఓట్ల కోసం యువతకు అలవిగాని హామీలు గుప్పించి గద్దెనెక్కిన తర్వాత పాలకులు చేస్తున్న మోసాలను ఎండగట్టనున్నారు. తప్పుడు వాగ్దానాలిచ్చిన ప్రభుత్వాల మెడలు వంచే దిశగా కార్యోన్ముఖులను చేయనున్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత యువత కోసం చేపట్టనున్న కార్యక్రమాలు, ఉద్యోగాల భర్తీ, పరీక్షల నిర్వహణలో తీసుకువచ్చే సంస్కరణలపై స్పష్టమైన ప్రకటన చేయనున్నారు.

# టీజీ ఆయిల్‌ఫెడ్‌పై తుమ్మల సమీక్ష



హైదరాబాద్, జులై 24: తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత & జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బషీర్‌బాగ్‌లోని పరిశ్రమ భవన్‌లో టీజీ ఆయిల్‌ఫెడ్ కార్యకలాపాలపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సంస్థ పనితీరు, భవిష్యత్ కార్యాచరణపై అధికారులతో విస్తృతంగా చర్చించారు.

సమావేశంలో రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ, తాజా పండ్ల గుత్తుల సేకరణ, ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచడం, రైతులకు సకాలంలో చెల్లింపులు, ఆయిల్‌ఫెడ్ అభివృద్ధి కార్యక్రమాల అమలు తదితర అంశాలను మంత్రి సమీక్షించారు. రైతులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఆయిల్ పామ్ సాగును మరింత ప్రోత్సహించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

# రాజ్యసభ ముందుకు 'వందేమాతరం' బిల్లు

న్యూఢిల్లీ, జులై 24:జాతీయ గీతం 'జనగణమన..' స్థాయిలో వందేమాతరం గేయానికి చట్టపరమైన రక్షణలు కల్పించే దిశగా కేంద్రం కీలక అడుగు వేసింది. హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ నేడు రాజ్యసభలో వందేమాతరం బిల్లును ప్రవేశపెట్టారు. వందేమాతరం గేయాన్ని అవమానిస్తే జైలు శిక్ష పడేలా బిల్లులో నిబంధనలు పొందుపరిచారు. అయితే, ఈ బిల్లుపై విపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో సభ సోమవారానికి వాయిదా పడింది.

వందేమాతరం గేయం ఆలాపనను కావాలని అడ్డుకున్నా, గేయం ఆలాపన జరుగుతున్న సమయంలో ఇబ్బందులు కలిగించినా నేరంగా పరిగణించేలా ప్రివెన్షన్ ఆఫ్ ఇన్‌సల్ట్స్ టూ నేషనల్ ఆనర్ 1971 చట్టానికి కేంద్రం తాజా బిల్లులో మార్పులు ప్రతిపాదించింది. అయితే, విపక్షాలు మాత్రం ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాయి. రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛాహక్కుకు భంగం కలిగించేలా బిల్లులో నిబంధనలు ఉన్నాయని చెబుతున్నాయి.

# ఢిల్లీ విద్యార్థులకు సంఘీభావంగా ఆందోళన

హైదరాబాద్, జులై 24: ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులకు సంఘీభావంగా స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఓ) ఆధ్వర్యంలో శుక్రవారం చార్మినార్ వద్ద నిరసన చేపట్టారు.

శుక్రవారం నమాజ్ అనంతరం సభ్యులు ప్లకార్డులతో ఆందోళన నిర్వహించి విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలను ఖండించారు.

జంతర్ మంతర్‌లో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఎస్ఐఓ నాయకులు పేర్కొన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సంతాన సాఫల్యతను సుసాధ్యం చేస్తున్న వైద్యులు ఎంబ్రియాలజిస్టులు

## (25 జూలై "ప్రపంచ ఐవిఎఫ్ (లేదా ఎంబ్రియాలజిస్ట్) దినోత్సవం" సందర్భంగా)

ప్రపంచంలోని తొలి ఐవిఎఫ్ బేబీకి నేడు 47 ఏండ్లు పూర్తి అవుతున్నాయి. 25 జూలై 1978న ఇంగ్లాండ్‌లో ప్రపంచంలోనే తొలి 'ఐవిఎఫ్ (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) బేబీ' అయిన "లూయిస్ బ్రౌన్" పుట్టి, సంతానలేమి సమస్యలు అనుభవిస్తున్న దంపతులకు ఒక నూతన శాస్త్రీయ ప్రక్రియకు ద్వారాలు తెరిచింది. నోబెల్ బహుమతి గ్రహీత "డా: రాబర్ట్ ఎడ్వర్డ్స్‌తో కలిసి "డా: ప్యాట్రిక్ స్టెప్‌టో" అను శాస్త్రవేత్త ఈ వినూత్న సంతాన సాఫల్య ఐవిఎఫ్ అనబడే మార్గాన్ని కనుగొనడం జరిగింది. ప్రపంచ ఐవిఎఫ్ దినోత్సవం వేదికగా ఈ వినుత్న సంతాన సాఫల్య ప్రక్రియను కనుగొన్న ఎంబ్రియాలజిస్టులను (పిండ శాస్త్రవేత్తలు) గుర్తు చేసుకోవడం, ఇదే వైద్య విధానాన్ని విజయవంతంగా కొనసాగిస్తూ, సంతానలేమి సమస్యకు తగిన పరిష్కారాలు చూపుతున్న ఎంబ్రియాలజిస్ట్ వైద్యులను సన్మానించుకోవడంతో పాటు ఈ సరి కొత్త పునరుత్పత్తి వైద్య సేవలను ప్రశంసించడం జరుగుతుంది. 2026 ప్రపంచ ఐవిఎఫ్ దినం ఇతివృత్తంగా "క్రియేటింగ్ హోప్స్, అడ్వాన్సింగ్ ఫర్టిలిటీ, ట్రాన్స్‌ఫామింగ్ లైఫ్స్" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది.

### ఐవిఎఫ్ అనగా?!

'ఐవిఎఫ్' అనగా 'ఇన్ విట్రో ఫర్టిలైజేషన్' అని అర్థం. 'ఇన్ విట్రో' అనగా 'ఒక గ్లాసులో' అని లేదా 'శరీరం బయట' లేదా 'ప్రయోగశాల'లో అని అర్థం చేసుకోవాలి. 'ఫర్టిలైజేషన్' అనగా 'ఫలదీకరణం' అని అర్థం. సాధారణంగా స్త్రీ గర్భంలోని ఎగ్స్ లేదా ఓవరీస్ (అండాశయం)తో పురుషుడి శుక్ర కణాలు లేదా స్పెర్మ్స్ కలిసి ఫరదీకరణం చెంది పిండం లేదా ఎంబ్రియో ఏర్పడడం వల్ల మహిళ గర్భధారణ జరుగుతుంది. స్త్రీ గర్భంలో జరగాల్సిన ఈ ఫలదీకరణాన్ని శరీరం వెలుపల ప్రయోగశాలలో చేయడాన్ని ఐలిఎఫ్ సంతాన సాఫల్య ప్రయోగ ప్రక్రియ అంటాం.

### ఎంబ్రియాలజిస్టుల పాత్ర:

ఎంబ్రియాలజిస్టులు అను శాస్త్రవేత్తలు సంతాన సాఫల్యం కోరుకునే దంపతులకు చెందిన ఆరోగ్యకరమైన శుక్ర కణాలు, ఎగ్స్ లేదా అండాశయం, ఎంబ్రియో లేదా పిండాలను జాగ్రత్తగా చూసుకుంటూ ఐవిఎఫ్ విధానంలో పిల్లల్ని కనడానికి ఆయా దంపతులకు వైద్య సలహాలు ఇవ్వడం జురుగుతుంది. నిజానికి ఎంబ్రియాలజిస్టులు తమ చేతుల్లో మరో శిశువుకు ప్రాణం పోస్తూ, ఐవిఎఫ్ ప్రక్రియలో సంతానం కలగడానికి కొత్త మార్గాన్ని విజయవంతంగా పూర్తి చేస్తారు.

### ప్రపంచవ్యాప్తంగా 8 మిలియన్ల ఐవిఎఫ్ శిశువుల జననం:

ఒకనాడు కొద్ది మంది దంపతులకు పలు కారణాల వల్ల సంతాన భాగ్యం ఉండేది కాదు. అలా సంతానం పొందలేని మహిళల్ని పౌర సమాజం 'గొడ్రాలా' అంటూ చిన్న చూపు చూసే ఆచారం నేటికీ గ్రామీణంలో కొనసాగుతున్నది. స్త్రీలతో పురుషుల పలు రుగ్మతల వల్ల సంతానలేమి సమస్యలు వస్తున్నప్పటికీ సంతానలేమి సమస్య స్త్రీ వల్ల మాత్రమే జరుగుతుందనే మూఢాచారం నేటికీ వాడవాడల్లో కనిపిస్తున్నది. 25 జూలై 1978న ప్రారంభమైన ఐవిఎఫ్ ప్రక్రియ నేడు విశ్వవ్యాప్తంగా అభాగ్య దంపతుల పాలిట వరంగా మారి, నేటి వరకు దాదాపు 8 మిలియన్ల శిశువుల జననాలకు కారణంగా సగర్వంగా నిలుస్తున్నది. సగటున ప్రతి ఆరుగురు దంపతుల్లో ఒక్కరికి సంతానాలేమి సమస్య బయట పడుతున్నది. సంతానం లేని దంపతుల వేదన వర్ణనాతీతం. సాధారణ పద్ధతుల్లో సంతానం కలగని దంపతులను ఎంపిక చేసుకొని వ్యంధ్యత్వం లేదా ఇన్‌ఫెర్టిలిటీ సమస్యలకు పలు మార్గాల్లో చికిత్సలు చేస్తూ వారి అంగీకారం మేరకు ఐవిఎఫ్ పద్ధతిలో ప్రయోగశాలలో ఫలదీకరణ ప్రక్రియను పూర్తి చేసి స్త్రీ గర్భంలోకి పిండాన్ని లేదా ఎంబ్రియోను చేర్చి, నవమాసాలు మోసిన తల్లి శిశువుకు జన్మను ఇస్తూ, ఆ కుటుంబంలోశాశ్వత సంతోష తోరణాలను కడుతుంది.

### వ్యంధ్యత్వం, సంతానలేమికి కారణాలు :

పురుషుల్లో తక్కువ శుక్ర కణాలు (స్పెర్మ్ కౌంట్) ఉండడం, శుక్ర కణాల మెబిలిటీ తక్కువగా ఉండడం, వెరికోసీల్, హార్మోన్ల అసమతుల్యత లేదా ఇంబ్యాలెన్స్, జన్యు రుగ్మతల వల్ల సంతానలేమి సమస్య రావచ్చు. స్త్రీల్లో పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పిసిఓఎస్), ఎండోమెట్రియాసిస్, గొట్టంలా మూసుకుపోవడం లేదా బ్లాక్డ్ ట్యూబ్స్, ఒవ్యులేషన్ రుగ్మతలు, వయస్సు, హార్మోనల్ సమస్యల వల్ల మహిళలకు సంతానం కలగక పోవచ్చు. కొన్ని సందర్భాల్లో దంపతులు ఇద్దరి జీవనశైలి కూడా సంతానలేమి సమస్యలకు దారితీయవచ్చు. పొగ తాగడం, ఆల్కహాల్ అతిగా సేవించడం, స్థూలకాయం, మానసిక ఒత్తిడి, పర్యావరణ టాక్సిన్స్‌కు గురి కావడం లాంటివి కూడా సంతానం కలగక పోవడానికి కారణాలుగా నిలుస్తున్నాయి.

### ఇన్‌ఫర్టిలిటీ, సంతానలేమి లేదా వంధ్యత్వ నివారణకు మార్గాలు:

దంపతుల మానసిక ఒత్తిడిని తగ్గించే టెక్నిక్స్ పాటించడం, తగిన వయస్సులో సంతానం కనడం, పునరుత్పత్తి సమస్యలను ముందస్తు గుర్తించడం, ఆరోగ్యకర పోషకాహారం తీసుకోవడం, బరువును నియంత్రించుకోవడం, పొగ తాగడాన్ని మూనుకోవడం, పరిమితుల్లో ఆల్కహాల్‌ను సేవించడం లాంటి ముందు జాగ్రత్తలతో సంతానలేమి సమస్యల నుంచి బయట పడవచ్చు.

ప్రపంచ ఐవిఎఫ్ దినోత్సవం వేదికగా స్వచ్ఛంద సంస్థలు, సంతానోత్పత్తి పట్ల అవగాహనలు పెంచడం, ప్రజారోగ్య వ్యవస్థలు సమయానుకూలంగా సంతానోత్పత్తి పట్ల అవగాహన కల్పించడం,

ఉచిత సంతానోత్పత్తి శిభిరాలు ఏర్పాటు చేయడం, వర్చువల్ వర్క్‌షాప్స్ నిర్వహించడం, సంతాన సాఫల్య వైద్యులను సన్మానించుకోవడం, ఐవిఎఫ్ చుట్టు అల్లుకొని ఉన్న అపోహలను తొలగించడం లాంటి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రయత్నాలు జరగాలి. ప్రతి జంట సంతానాన్ని పొంది ఇల్లంతా సంబరాల స్వర్గంగా మారాలి.



-మధుపాలీ
9949700037

# 618 మిలియన్ డాలర్లు దాటిన పెట్టుబడులు.. ఊపందుకున్న ప్రైవేటు అంతరిక్ష రంగం

## -పార్లమెంటుకు వెల్లడించిన డాక్టర్ జితేంద్ర సింగ్



న్యూ ఢిల్లీ, జులై 24:భారత అంతరిక్ష రంగంలో కీలక సంస్కరణల అనంతరం గొప్ప పురోగతి నమోదైందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్రాల శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ రాజ్యసభలో పేర్కొన్నారు. ప్రైవేటు సంస్థలకు 105 అధికారిక అనుమతులు జారీ అవ్వడంతోపాటు ప్రైవేటు రంగంలోకి 187 మిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూనే, దేశ వ్యూహాత్మక ప్రయోజనాలు, జాతీయ భద్రత రక్షణకు బలమైన నియంత్రణ వ్యవస్థను ప్రభుత్వం బలోపేతం చేస్తోందని ఆయన అన్నారు.

రాజ్యసభలో అడిగిన నక్షత్ర గుర్తు లేని ప్రశ్నకు సమాధానమిస్తూ కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పలు కీలక గణాంకాలను వెల్లడించారు. 2026 జూలై 14 నాటికి ప్రభుత్వేతర సంస్థలకు 105 అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. 2026 సంవత్సరంలోనే ప్రైవేటు రంగంలోకి 187 మిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చినట్లు వివరించారు. గత కొన్నేళ్లలో ప్రైవేటు నిధుల సమీకరణ దాదాపు ఆరు రెట్లు పెరిగిందని చెప్పారు. 2021-22లో 100.5 మిలియన్ డాలర్లుగా ఉన్న ఈ మొత్తం 2023-24లో 348.5 మిలియన్ డాలర్లకు, 2026 మార్చి 31 నాటికి 618.5 మిలియన్ డాలర్లకు చేరుకుందని తెలిపారు. ఇది దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న అంతరిక్ష రంగ వ్యవస్థపై దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారుల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.


వేగవంతమైన వాణిజ్య వృద్ధితో పాటు పటిష్టమైన జాతీయ భద్రతా రక్షణ చర్యలను చేపట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు డాక్టర్ జితేంద్ర సింగ్ రాజ్యసభకు తెలియజేశారు. ప్రైవేటు అంతరిక్ష కార్యకలాపాల కోసం వచ్చే ప్రతి దరఖాస్తును అనుమతించే ముందు.. ఇన్ స్పేస్ నిబంధనలు, మార్గదర్శకాలు, విధానాల (ఎన్‌జీపీ) ప్రకారం వ్యూహాత్మక, భద్రతా, జాతీయ ప్రయోజనాలను సమగ్రంగా మూల్యాంకనం చేస్తున్నట్లు చెప్పారు. ప్రైవేటు రంగ భాగస్వామ్యం విస్తరిస్తున్న నేపథ్యంలో దేశ నియంత్రణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి భాగస్వాములతో సంప్రదించి అంతరిక్ష కార్యకలాపాలు, సురక్షిత నిర్వహణ కోసం ప్రత్యేక భద్రతా మార్గదర్శకాలను ఇన్ స్పేస్ రూపొందిస్తోందని వెల్లడించారు.

భారత ప్రైవేటు అంతరిక్ష రంగ పురోగతిని వేగవంతం చేసేందుకు ప్రభుత్వం సమగ్ర విధానపరమైన, నియంత్రణ, ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేసిందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా భారత అంతరిక్ష విధానం 2023 అమలు, సరళీకృత విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)విధానం, ఇన్ స్పేస్ ద్వారా సులభతరం చేసిన అనుమతుల ప్రక్రియ, ఇస్రో సదుపాయాలను రాయితీతో వినియోగించుకునే వెసులుబాటు, రూ. 1,000 కోట్ల వెంచర్ క్యాపిటల్ ఫండ్, రూ. 500 కోట్ల టెక్నాలజీ అడాప్షన్ ఫండ్, ఇన్ స్పేస్ సీడ్ ఫండ్ పథకం, అంకుర సంస్థలకు వ్యవస్థాపకత, ఇంక్యుబేషన్ మద్దతు, ఇస్రో నుంచి ప్రైవేటు సంస్థలకు సాంకేతికత బదిలీ, తక్కువ ఖర్చుతో కూడిన పరిశోధన, పరీక్షా మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించే పరిశ్రమల అవగాహన సదస్సులు వంటి కార్యక్రమాలు ఉన్నాయి.

అంతరిక్ష కార్యకలాపాలు నిర్వహించడానికి ఇప్పటివరకు 17 అంతరిక్ష అంకుర సంస్థలకు ఇన్ స్పేస్ అనుమతులు ఇచ్చిందని శ్రీ జితేంద్ర సింగ్ రాజ్యసభకు తెలిపారు. ఇది భారత అంతరిక్ష లక్ష్యాలకు ఎంతగానో తోడ్పడుతున్న ఒక చైతన్యవంతమైన స్టార్టప్ వ్యవస్థ ఆవిర్భావాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు.

2020లో తీసుకొచ్చిన అంతరిక్ష రంగ సంస్కరణలపై ఇన్ స్పేస్ చేపట్టిన ప్రభావ అంచనా నివేదిక వివరాలను మంత్రి రాజ్యసభలో పంచుకున్నారు. ఈ సంస్కరణలు ఆరేళ్ల కాలంలోనే భారత ప్రైవేటు అంతరిక్ష రంగ స్వరూపాన్ని పూర్తిగా మార్చివేశాయని చెప్పారు. 2014లో కేవలం ఒక్కటే ఉన్న క్రియాశీల అంతరిక్ష అంకుర సంస్థల సంఖ్య నేడు 400 దాటిందని, ప్రైవేటు పెట్టుబడులు 600 మిలియన్ డాలర్లు దాటాయని తెలిపారు. భారతీయ ప్రైవేటు కంపెనీలు అంతరిక్షంలోకి ఉపగ్రహాలను పంపే, కక్ష్యలోకి ప్రవేశపెట్టే సామర్థ్యాలను విజయవంతంగా ప్రదర్శించాయని, ప్రైవేటు సంస్థలు 30 కంటే ఎక్కువ ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టాయని చెప్పారు. పీఎస్ఎల్వీ ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంటల్ మాడ్యూల్ వంటి వేదికల ద్వారా దాదాపు 45 పేలోడ్లలను అంతరిక్షంలోకి పంపాయన్నారు. ఈ పురోగతి మన దేశ ప్రైవేటు అంతరిక్ష రంగానికి ఉన్న సాంకేతిక ప్రావీణ్యాన్ని, వాణిజ్యపరమైన పరిణతిని స్పష్టంగా చాటిచెబుతోందని మంత్రి వివరించారు.

ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో భారత్‌కు పెరుగుతున్న ప్రపంచ ప్రాబల్యాన్నిఈ ప్రభావ అంచనా నివేదిక స్పష్టం చేస్తోంది. భారతీయ అంతరిక్ష సంస్థలు అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తూ, విదేశీ కార్యకలాపాలను విస్తరిస్తూ, ప్రపంచ భాగస్వాములతో కలిసి పనిచేస్తున్నాయి. 45 కంటే ఎక్కువ దేశాలతో ఇన్ స్పేస్ సంస్థ కార్యాచరణ సంబంధాలను నెలకొల్పి, పలు విదేశీ అంతరిక్ష సంస్థలతో సహకార ఒప్పందాలపై సంతకాలు చేసింది. స్వదేశంలో భూపరిశీలన ప్రభుత్వ-ప్రైవేటు రంగాల ఉమ్మడి భాగస్వామ్యం ద్వారా ప్రముఖ భారతీయ కంపెనీలు కలిసి సుమారు రూ. 1,200 కోట్ల ప్రైవేటు పెట్టుబడితో దేశంలోనే తొలి ప్రైవేటు భూపరిశీలన ఉపగ్రహ సమూహాన్ని అభివృద్ధి చేస్తున్నాయి. భారత అంతరిక్ష సంస్కరణలపై పారిశ్రామిక రంగానికి ఉన్న నమ్మకానికి ఈ భారీ భాగస్వామ్యమే ప్రత్యక్ష నిదర్శనం.

ఆహ్వానం
నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో
నెలపొడుపు
వనపట్ల సుబ్బయ్య కవిత్వం
పసరంటిన కొడవలి
ఆవిష్కరణ సభ

సభాధ్యక్షులు: వహీద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక
ముఖ్యఅతిథి: సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ మంత్రివర్యులు వ్యవసాయ శాఖ
విశిష్ట అతిథి: మర్రి జనార్దన్ రెడ్డి, మాజీ శాసన సభ్యులు నాగర్ కర్నూల్
గౌరవ అతిథులు: కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి, కాళోజీ అవార్డు గ్రహిత; చింతలపల్లి భాస్కర్ రావు, విశ్రాంత అధ్యాపకులు; వాసుదేవుడు, గ్రామ సర్పంచ్ వనపట్ల గ్రామం
ప్రధాన వక్త: ఆచార్య కోయి కోటేశ్వర రావు, తెలుగు శాఖ అధ్యక్షులు, ప్రభుత్వ సిటీ కళాశాల హైదరాబాద్
ఆత్మీయ అతిథులు: నాగవరం బాల్ రాం, హెచ్ రమేష్ బాబు, గుడిపల్లి నిరంజన్, ఎదిరెపల్లి కాశన్న, తగుళ్ల గోపాల్, కొట్ల నిరంజన్ రెడ్డి, కొండకింది మన్యప్ రెడ్డి, కందికొండమోహన్, కల్వకోల్ మద్దిలేటి, ముచ్చర్ల దినకర్, ఆమ్ గోత్ వెంకట్ పవార్, నీరటి బాలీశ్వర్, మహమ్మద్ ఖాజ
సభాసమన్వయం

ఆదివారం, 26 జూలై 2026, ఉదయం 10:00 గంటలకు
స్థలం: తిరుమల ఫంక్షన్ హాల్, నాగర్ కర్నూల్
అందరికీ హృదయపూర్వక ఆహ్వానం....


# మహిళల కోరిక మేరకు ముప్పిరితోటకు ఆర్టీసీ బస్సు

## -ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం : ప్రభుత్వ విప్ విజయ రమణారావు



కరీంనగర్, జులై 24: ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు ముప్పిరితోట గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించినట్లు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలిపారు. గురువారం ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామంలో డిపో మేనేజర్ కవితతో కలిసి గోదావరిఖని నుంచి ముప్పిరితోట మీదుగా గర్రెపల్లి వరకు నడిచే ఆర్టీసీ బస్సును ప్రారంభించారు.

ఈ సందర్భంగా విజయ రమణారావు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా పెద్దపల్లిలో ఆర్టీసీ డిపో ఏర్పాటుకు ఎవరూ ప్రయత్నిం చలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒప్పించి, 2024 డిసెంబరులో పెద్దపల్లిలో నిర్వహించిన బహిరంగ సభలో ఆర్టీసీ డిపో ఏర్పాటును ప్రకటించేలా చేశామని తెలిపారు.

రానున్న రెండు నెలల్లో దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పెద్దపల్లి ఆర్టీసీ డిపోను ప్రారంభించి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. మాట తప్పే అలవాటు తనకు లేదని, ప్రజల అవసరాలను గుర్తించి నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు.

రూ. 12 కోట్ల నిధులతో ముప్పిరితోట మీదుగా నిర్మిస్తున్న డబుల్ రోడ్డు పనులను రెండు నెలల్లో పూర్తి చేయిస్తామని తెలిపారు. ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని, రాష్ట్రంలో మరో మూడు లక్షల పింఛన్లను ఆరు నెలల్లో మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ మారం రాయమల్లు, తహసీల్దార్ యాకన్న, ఎంపీడీఓ భాస్కర్‌రావు, నాయకులు రామిడి వెంకట్రామిరెడ్డి, సావు రాజేశ్వర్‌రెడ్డి, సంతోష్‌రావు, వెంకటేశ్వర్‌రావు, దేవ్‌రాజు, లాలయ్య, పలు గ్రామాల సర్పంచులు, మహిళలు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకం

## -బి.ఎం.ఎస్.ఆర్.యు. రాష్ట్ర అధ్యక్షులు పప్పుల సురేష్



కరీంనగర్, జులై 24: (నేటినిజం ప్రతినిధి) కార్మిక శక్తియే నిజమైన జాతీయ శక్తి అని, కార్మికులంతా అంకితభావంతో, దేశభక్తితో విధులను నిర్వర్తించాలని భారతీయ వైద్య విక్రయ ప్రతినిధుల యూనియన్ (బి.ఎం.ఎస్.ఆర్.యు.) రాష్ట్ర అధ్యక్షులు పప్పుల సురేష్ పిలుపునిచ్చారు.బి.ఎం.ఎస్. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేద్కర్ నగర్ కూడలిలో బి.ఎం.ఎస్. ఆర్.యు. ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులు పప్పుల సురేష్ జెండా ఆవిష్కరించి, యూనియన్ సిద్ధాంతాలను కార్యకర్తలకు వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో కార్మిక వర్గం పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. ఏ రంగానికి చెందిన కార్మికులైనా దేశభక్తితో పనిచేస్తేనే ఆ అభివృద్ధి ఫలాలు సమాజానికి అందుతాయన్నారు.' 'దేశం బాగుంటే పరిశ్రమ బాగుంటుంది, పరిశ్రమ బాగుంటే కార్మికుడు బాగుంటాడు" అనే చక్రంలా ఈ వ్యవస్థ సాగుతుందని, అప్పుడే దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని వివరించారు. రాజకీయాలకు అతీతంగా, ప్రత్యేక సిద్ధాంతాలతో పనిచేస్తున్న భారతీయ కార్మిక సంఘం (బి.ఎం.ఎస్.) ప్రపంచంలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా అవతరించిందని పేర్కొన్నారు. ఇటువంటి గొప్ప సంఘంలో కార్యకర్తలుగా కొనసాగడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమన్నారు.ఈ కార్యక్రమంలో బి.ఎం.ఎస్. జిల్లా అధ్యక్షులు పసుల శ్రవణ్, కార్యదర్శి తొర్తి శ్రీనివాస్, బి.ఎం.ఎస్.ఆర్.యు. జిల్లా నాయకులు ఆముదుర్తి రవి, క్యాతం శ్రీనివాస్, నల్ల నవీన్, గోవిందుల సతీష్, మాదాసు విక్రమ్, వెంకటరమణ, సుల్తాన్, నక్క అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# కో-ఆపరేటివ్ ఎన్నికల ప్రక్రియ పూర్తి

నల్గొండ, జులై 24: ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ ఫ్యాబ్రిక్స్ మార్కెటింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, న్యూఢిల్లీ సాధారణ సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన మాజీ డీసీసీబీ డైరెక్టర్, నేలపట్ల హ్యాండ్లూమ్ వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్ పిల్లలమర్రి శ్రీనివాస్ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అధికారిక పత్రాలను సమర్పించారు. సొసైటీ తరఫున అధికారిక ప్రతినిధిగా ఎన్నికల అధికారిని కలిసి అవసరమైన ప్రక్రియలను పూర్తి చేశారు.ఎన్నికల నిబంధనల ప్రకారం ఎన్నికల అధికారి సమక్షంలో స్పెసిమెన్ సంతకాలు చేసి ధృవీకరించుకున్నారు.



అనంతరం సొసైటీ బోర్డు తీర్మానంతో పాటు అనెక్సర్?4, అనెక్సర్?5 తదితర పత్రాలను సంబంధిత అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా పిల్లలమర్రి శ్రీనివాస్ మాట్లాడుతూ చేనేత సహకార సంఘాల ప్రయోజనాల పరిరక్షణే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. తెలంగాణ చేనేత కార్మికుల సమస్యలను జాతీయ స్థాయిలో ప్రస్తావించి వారి సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తానని చెప్పారు.

# రాహుల్‌కు మద్దతుగా కాంగ్రెస్ నిరసన

## - వేములవాడలో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన

రాజన్న సిరిసిల్ల, జులై 24:(నేటినిజం ప్రతినిధి): టీపీసీసీ పిలుపు మేరకు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి సంఘీభావంగా వేములవాడ తిప్పాపురంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూమ్ మధు, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ ఢిల్లీలో రాహుల్ గాంధీపై జరిగిన దాడిని ఖండించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకుడి స్వేచ్ఛను హరించే చర్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. నెహ్రూ-గాంధీ కుటుంబం దేశాభివృద్ధికి విశేష సేవలు అందించిందని, రాహుల్ గాంధీ రైతులు, యువత, మహిళలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడుతున్నారని తెలిపారు. ప్రజల తరఫున ప్రశ్నించే స్వరాన్ని అణచివేయాలనే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించిన వారు, ప్రజాస్వామ్యాన్ని ఎవరూ అణచలేరని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య, రాజ్యాంగ, లౌకిక విలువల పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహారాష్ట్రలో భారత్ ట్యాక్సీ సేవలను ప్రారంభించిన ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్ర సహకార శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్

న్యూఢిల్లీ, జులై 24:సహకారం, ఆవిష్కరణలు, సమ్మిళిత అభివృద్ధి ద్వారా దేశ రవాణా రంగంలో మార్పులు తీసుకురావడంలో భాగంగా మహారాష్ట్రలో భారత్ ట్యాక్సీ సేవలు ప్రారంభమయ్యాయి. నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో నిర్వహించిన కార్యక్రమంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్ర సహకార శాఖ సహాయ మంత్రి శ్రీ మురళీధర్ మోహోల్ ఈ సేవలను ప్రారంభించారు. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ 'సహకార్ సే సమృద్ధి' దార్శనికతకు అనుగుణంగా, కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా నాయకత్వంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, సహకార రంగ ప్రతినిధులు, అధికారులు, భారత్ ట్యాక్సీతో పని చేసే సారథులు పాల్గొన్నారు. ట్యాక్సీ సారథులను కేవలం డ్రైవర్లుగా కాకుండా సేవకు యజమానులుగా, సహకార సంస్థ సభ్యులుగా, సంస్థ అభివృద్ధిలో భాగస్వాములుగా గుర్తించే సమానత్వ సహకార రవాణా నమూనాను భారత్ ట్యాక్సీ ముందుకు తీసుకువెళుతోంది.

కేంద్ర సహకార శాఖ సహాయ మంత్రి శ్రీ మురళీధర్ మోహోల్ మాట్లాడుతూ, మహారాష్ట్రలో భారత్ ట్యాక్సీ ప్రారంభం రాష్ట్ర సహకార రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని అన్నారు. మహారాష్ట్ర సహకార ఉద్యమానికి పుణ్యభూమి అని, వందేళ్లకు పైగా సుసంపన్నమైన సహకార సంప్రదాయాన్ని కలిగి ఉందని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 8.60 లక్షలకు పైగా సహకార సంఘాల్లో దాదాపు 2.5 లక్షల సంఘాలు ఒక్క మహారాష్ట్రలోనే పనిచేస్తున్నాయని, ఇది భారత సహకార ఉద్యమంలో రాష్ట్రం అందిస్తున్న గణనీయమైన భాగస్వామ్యాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు.

దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రతి రంగానికి సహకార ప్రయోజనాలను విస్తరించడం, సహకార సంస్థల సమగ్ర అభివృద్ధిని సాధించడం లక్ష్యంగా ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ 2021లో ప్రత్యేకంగా సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారని శ్రీ మురళీధర్ మోహోల్ గుర్తు చేశారు. సహకార రంగంలో విశేష అనుభవం కలిగిన శ్రీ అమిత్ షాను దేశ తొలి సహకార శాఖ మంత్రిగా నియమించిన అనంతరం, సహకార ఉద్యమానికి కొత్త దిశ, నూతన వేగం, మరింత విస్తృత ప్రాచుర్యం లభించిందని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్య సాధనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, సహకార రంగం కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు.

సహకార రంగాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటు అనంతరం గత ఐదేళ్లలో దాదాపు 152 కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. వీటిలో కొత్త జాతీయ సహకార విధానం, దేశవ్యాప్తంగా రెండు లక్షల కొత్త బహుళ ప్రయోజన సహకార సంఘాల ఏర్పాటు లక్ష్యం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) ఆర్థికంగా బలోపేతం అయ్యేలా చేపట్టిన చర్యలు ముఖ్యమైనవని పేర్కొన్నారు. ఇప్పటికే దాదాపు 40 వేల కొత్త సహకార సంఘాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

దాదాపు రూ. 3,000 కోట్ల వ్యయంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను (పీఏసీఎస్) కంప్యూటరీకరణ చేస్తున్నామని, వాటిని 25కు పైగా ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించేలా బలోపేతం చేస్తున్నామని శ్రీ మోహోల్ తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు 39 వేల సహకార సంఘాలు ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా పనిచేస్తున్నాయని, సుమారు 54 వేల పీఏసీఎస్‌లు కామన్ సర్వీస్ సెంటర్లుగా సేవలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. సహకార సంస్థలు ప్రస్తుతం పెట్రోల్ బంకులు, జన ఔషధి కేంద్రాల నిర్వహణతో పాటు ధాన్య నిల్వలు, వివిధ గ్రామీణ సేవా కార్యక్రమాల్లో కూడా భాగస్వాము లవుతున్నాయని తెలిపారు గ్రామస్థాయి సహకార సంస్థలను బలోపేతం చేయడం ద్వారా రైతులు, గ్రామాలు, తాలూకాలు, జిల్లాలు, రాష్ట్రాలు ఆర్థికంగా సాధికారత సాధించి అభివృద్ధి, సమృద్ధి దిశగా ముందుకు సాగేలా చేయడమే ఈ ప్రయత్నాల ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం, సేంద్రియ ఉత్పత్తులకు హామీతో కూడిన మార్కెట్లు కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తులకు ఎగుమతి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా భారతీయ విత్తన సహకార సమితి (బీబీఎస్ఎస్ఎల్), నేషనల్ కోఆపరేటివ్ ఆర్గానిక్స్ లిమిటెడ్ (ఎన్‌సీఓఎల్), నేషనల్ కోఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ (ఎన్‌సీఈఎల్)లను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా దాదాపు 70 వేల సహకార సంస్థలు ఈ మూడు జాతీయ సహకార సంస్థల్లో సభ్యులుగా చేరాయని తెలిపారు. సహకార రంగానికి అవసరమైన శిక్షణ పొందిన మానవ వనరులను అభివృద్ధి చేయడం లక్ష్యంగా దేశంలో తొలి సహకార విశ్వవిద్యాలయాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

మహారాష్ట్రలో సహకార రంగాన్ని బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్ నాయకత్వంలో తీసుకుంటున్న చర్యలను ప్రస్తావిస్తూ, నేషనల్ కోఆపరేటివ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ) ద్వారా రాష్ట్రంలోని సహకార చక్కెర కర్మాగారాలకు దాదాపు రూ.10,000 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు శ్రీ మోహోల్ తెలిపారు. రాష్ట్రంలో ఇథనాల్, కంప్రెస్డ్ బయోగ్యాస్‌కు సంబంధించిన కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నట్లు కూడా ఆయన పేర్కొన్నారు. సహకార గృహ నిర్మాణ రంగానికి స్వతంత్ర న్యాయపరమైన వ్యవస్థను ఏర్పాటు చేయడం, స్వీయ పునరాభివృద్ధిని ప్రోత్సహించడం దిశగా కూడా కీలక చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. సహకార సంస్థల ద్వారా టిష్యూ కల్చర్‌ను ప్రోత్సహించే కార్యక్రమానికి భూమిని అందించిన దేశంలోనే తొలి రాష్ట్రంగా మహారాష్ట్ర నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

మహారాష్ట్రలో పెద్ద సంఖ్యలో ఉన్న సహకార సంస్థలు, వ్యవస్థల ద్వారా రాబోయే రోజుల్లో భారత్ ట్యాక్సీ సేవలను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు విస్తరించనున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని యువత, మహిళలు పెద్ద సంఖ్యలో భారత్ ట్యాక్సీలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. భారత్ ట్యాక్సీ నూతన ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించడంతో పాటు సారథులను సహకార సంస్థ అభివృద్ధి, లాభాల్లో భాగస్వాములుగా నిలుపుతుందని పేర్కొన్నారు. ప్రజలంతా సహకార సారథులుగా, సంపన్న మహారాష్ట్ర నిర్మాణంలో భాగస్వాములుగా మారాలని ఆయన కోరారు.

మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ, ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ, దేశ తొలి సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా నాయకత్వంలో సహకార రంగంలో వచ్చిన నూతన విప్లవ ప్రభావం ఇప్పుడు మహారాష్ట్ర రవాణా రంగంలోనూ కనిపిస్తోందని తెలిపారు. ఢిల్లీ, గుజరాత్‌ల తర్వాత మహారాష్ట్రలో భారత్ ట్యాక్సీ ప్రారంభంతో, సహకారం ద్వారా ఉపాధి, ఉపాధి ద్వారా సమృద్ధి సాధించే నూతన నమూనా మరింత ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. గ్రామస్థాయి ప్రాథమిక సహకార సంఘాల నుంచి వివిధ సహకార సంస్థల వరకు వాటిని బలోపేతం చేయడం, ఆధునీకరించడం, మరింత పారదర్శకత తీసుకురావడంతో పాటు, వాటి కోసం కొత్త వ్యాపార నమూనాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ మార్పు దిశలో భారత్ ట్యాక్సీ ఒక ముఖ్యమైన భాగమని పేర్కొన్నారు.

యాప్ ఆధారిత ట్యాక్సీ సేవలు ప్రయాణికులకు రవాణాను మరింత సౌకర్యవంతం చేశాయని, అయితే డిమాండ్ పెరిగినప్పుడు అదనపు ఛార్జీలు, చెప్పకుండా వసూలు చేసే రుసుములు, అధిక కమిషన్లు వంటి సమస్యలు ప్రయాణికులు, డ్రైవర్లు ఇద్దరికీ తరచూ ఇబ్బందులు కలిగించాయని తెలిపారు. ఈ సమస్యలకు భారత్ ట్యాక్సీ సహకార విధానంలో పరిష్కారం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ నమూనాలో ట్యాక్సీ సారథులు కేవలం డ్రైవర్లుగా కాకుండా, సహకార సంస్థకు యజమానులు, వాటాదారులుగా కూడా ఉంటారని, సంస్థ ఆర్జించే లాభాల్లో వారికి వాటా లభిస్తుందని తెలిపారు. ఈ సేవలో రద్దీ ఛార్జీలు, చెప్పకుండా వసూలు చేసే ఛార్జీలు ఉండవని, నిర్ణీత సేవా రుసుము ఆధారంగా ఇది పనిచేస్తుందని చెప్పారు. భారత్ ట్యాక్సీ ద్వారా ప్రజలకు సురక్షితమైన, విశ్వసనీయమైన, నాణ్యమైన రవాణా సేవలు అందుతాయని ఆయన పేర్కొన్నారు. మహిళా ప్రయాణికుల భద్రత, ప్రయాణికులతో మర్యాదపూర్వక ప్రవర్తన, పారదర్శకమైన ఛార్జీలు, జవాబుదారీతనంతో కూడిన సేవల వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. దివంగత డి.బి. పాటిల్ కోఆపరేటివ్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ఎంతో కీలకమైనదని పేర్కొంటూ, నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో నివసించే దాదాపు 3,000 నుంచి 4,000 మంది స్థానికులకు రుణ సౌకర్యం ద్వారా ట్యాక్సీలు అందించి, వారిని భారత్ ట్యాక్సీ వేదికతో అనుసంధానం చేసేందుకు ప్రయత్నాలు చేస్తామని తెలిపారు. ఇందువల్ల స్థానిక యువతకు కొత్త ఉపాధి, వ్యాపార అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో భారత్ ట్యాక్సీతో అనుబంధం ఉన్న సారథులకు షేర్ సర్టిఫికెట్లు, సేవా కిట్లను పంపిణీ చేశారు. దళారుల ఆధారిత వ్యవస్థ స్థానంలో సారథి కేంద్రిత రవాణా వ్యవస్థను తీసుకురావడమే భారత్ ట్యాక్సీ ఉద్దేశం. సారథులకు స్థిరమైన ఆదాయం కల్పించడం, ప్రయాణికులకు పారదర్శక ఛార్జీలతో సురక్షిత సేవలు అందించడం, సంస్థ ఆర్జించే లాభాలను సారథులతో పంచుకోవడం లక్ష్యంగా ఇది పనిచేస్తుంది. రానున్న కాలంలో రాష్ట్రంలోని సహకార సంస్థలు, రవాణా సంస్థలు, స్థానిక సంస్థల సహకారంతో మరింత మంది ట్యాక్సీ డ్రైవర్లు, యువత, మహిళలు, స్థానిక సమాజాలను ఈ వేదికతో అనుసంధానం చేస్తూ దశలవారీగా భారత్ ట్యాక్సీ సేవలను మహారాష్ట్ర అంతటా విస్తరించనున్నారు.

## గ్రామాభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

నిజామాబాద్, జులై 24: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీవో) సాయన్న అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని పోచారం, ఎంఎస్సీ ఫారం గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను డీఆర్‌డీవో సాయన్న, ఎంపీడీవో శంకర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల అమలు, గ్రామాభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు.

పోచారం గ్రామంలో పాఠశాల నర్సరీ, మహిళా సంఘ భవనం తదితర సదుపాయాలను పరిశీలించిన డీఆర్‌డీవో, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించే చర్యలను కూడా సమాంతరంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నీరడి జ్యోతి రవికుమార్, పంచాయతీ కార్యదర్శి పద్మ, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రప్రకాశ్, గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

## మక్తల్‌లో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

మహబూబ్‌నగర్, జులై 24: బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ 50వ జన్మదిన వేడుకలను మక్తల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. మక్తల్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు వేడుకలు జరుపుకున్నారు. మక్తల్‌లోని శ్రీ పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా చిట్టెం రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేటీఆర్ విశేష సేవలు అందించారని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని, కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో వెనుకబడిందని విమర్శించారు. రైతు సంక్షేమ పథకాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆరోపిస్తూ, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలని అన్నారు. కేటీఆర్‌కు ఆయురారోగ్యాలు, మరింత శక్తి ప్రసాదించాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 29న గురుపౌర్ణమి ఉత్సవాలు



నల్గొండ, జులై 24:గురుపౌర్ణమి సందర్భంగా ఈ నెల 29న చిట్యాలలోని యోగ మందిరంలో గురుపూజోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు యోగ సాధకులు కాచం కృష్ణయ్య, బూరుగు కృష్ణయ్య, కంచర్ల ఈశ్వరయ్య తెలిపారు. యోగ మందిరంలో యోగ సాధన అనంతరం నిర్వహించిన సమావేశంలో గురుపౌర్ణమి వేడుకల ఏర్పాట్లపై చర్చించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంకల్ప క్రియ యోగ గురువు శ్రీ రఘు గురూజీ ముఖ్య అతిథిగా హాజరై సాధకులను ఉద్దేశించి ఆధ్యాత్మిక సందేశం అందించనున్నట్లు తెలిపా రు. గురుపౌర్ణమి వేడుకలకు యోగ సాధకులు, భక్తులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాచం రమేష్, దాడి అరుణ, రేగొండ వేణుమాధవ్, నారబోయిన శ్రీను, మాస శ్రీనివాస్, ఆనంతుల యాదయ్య, గాదె ఎల్లేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి..

**–ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాఠశాల లను పరిశీలన**
**–జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి,**



మహబూబ్‌నగర్, జులై 24: నాగర్ కర్నూలు నియోజకవర్గంలోని తూడుకుర్తి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులను పురోగతిని ప్రస్తుతం కొనసాగుతున్న పనులను పరిశీలించిన వారు, చేపడుతున్న పనుల నాణ్యత, నిర్మాణ ప్రమాణాలు, పూర్తి స్థాయి మౌలిక వసతుల కల్పనపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, శాసనమండలి సభ్యులు కూచుకు ళ్ల దామోదర్ రెడ్డితో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. అనంతరం వారు ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాన్ని, అప్పర్ ప్రైమరీ స్కూల్ ను సంద ర్శించారు

ఈ సందర్భంగా పాఠశాల భవన సముదాయంలోని అన్ని వసతులు సౌకర్యాలు అన్నింటిని పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సాగుతున్నాయా లేదా అనే అంశాలను స్వయంగా పరిశీలించి, అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ., గురుకుల విద్యార్థులకు అత్యుత్తమ విద్యా వాతావరణాన్ని కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ఆధునిక సౌకర్యాలతో కూడిన విద్యాసంస్థలను నిర్మిస్తోందన్నారు. నిర్మాణంలో ఎలాంటి రాజీ పడకుండా నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి పనిని ఇంజినీరింగ్ ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసి విద్యార్థుల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

శాసనమండలి సభ్యులు కూచుకుళ్ల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు పట్టణ స్థాయి విద్యా సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తోందన్నారు. భవనం పూర్తయిన తర్వాత విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అన్ని వసతులు ఒకేచోట లభిస్తాయని. పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

అనంతరం అధికారులు నిర్మాణ పనుల ప్రస్తుత స్థితి, పూర్తయిన పనులు, మిగిలిన పనులు, వాటి పూర్తి గడువు తదితర అంశాలను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీకి వివరించారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న సమస్యలను కూడా వారి దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణం పనులు, ప్రీ ప్రైమరీ స్కూలు, అప్పర్ ప్రైమరీ స్కూలు ఏటీసీ సెంటర్ స్థల పరిశీలన చేసి వాటి నిర్వహణ పనితీరులను ఎమ్మెల్సీ కలెక్టర్ తెలుసుకున్నారు తగిన సూచన లను చేశారు ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఆర్డీవో అర్చన, తాహసిల్దార్ తబితా రాణి, సంబ ంధిత శాఖల ధ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, కాం ట్రాక్టర్ ప్రతినిధులు, ప్రజాప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

## అప్పట్లో డబ్బుల్లేకుండానే రాజకీయాలు చేశాం..

**–అనంత కిషన్ సేట్‌తో అనుబంధాన్ని పంచుకున్న జగ్గన్న**




సంగారెడ్డి, జులై 24: (నేటినిజం ప్రతినిధి):90వ దశకంలో డబ్బులు లేకుండానే రాజకీయాలు చేశామని, ప్రజల నమ్మకం, కార్యకర్తల అండదండలే తమకు బలమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి అన్నారు. రాజకీయాల్లో తన 40 ఏళ్ల ప్రస్థానాన్ని గుర్తు చేసుకుంటూ పాత జ్ఞాపకాలను ఆయన పంచుకున్నారు.

రాజకీయ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఎన్నో సందర్భాల్లో అప్పులు కూడా చేసేవాళ్లమని జగ్గారెడ్డి తెలిపారు. అప్పటి పరిస్థితుల్లో పదవులు, డబ్బు కోసం కాకుండా ప్రజా సేవే లక్ష్యంగా రాజకీయాలు చేసేవారమని చెప్పారు. ప్రజల ప్రేమ, కార్యకర్తల నమ్మకంతోనే రాజకీయంగా ఎదిగామని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త తోపాజీ అనంత కిషన్ సేట్‌తో తనకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని జగ్గారెడ్డి గుర్తు చేసుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహబంధం ఎన్నో ఒడిదుడుకులను చూసిందని, కష్టసుఖాల్లో పరస్పరం తోడుగా నిలిచామని చెప్పారు. కొన్ని సందర్భాల్లో ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు తోపాజీ అనంత కిషన్ సెట్, సుజాత సౌండ్ సిస్టమ్ శివకుమార్ సెట్ ప్రోత్సాహం మరువలేనిదని గుర్తు చేశారు.

కిషన్ సెట్ కు 15 కోట్లు, శివకుమార్ సెట్ కు 3 కోట్ల బకాయి ఉన్నట్టు జగ్గన్న వెల్లడించారు. అయినా పేదలను ఆదుకునేందుకు వెనకడుగు వేసేది లేదని మరోసారి గుర్తు చేశారు. నేటి రాజకీయాల్లో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని, గతంలో ఉన్న విలువలు, నిబద్ధత, సేవాభావం రాజకీయాలకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజల విశ్వాసమే రాజకీయ నాయకుడికి అతిపెద్ద సంపద అని ఆయన పేర్కొన్నారు.

## ఫిర్యాదుపై వెంటనే విచారణకు ఆదేశం..

అమరావతి, జులై 24: గత ప్రభుత్వంలో తన పేరు మీద ఉన్న కుళాయి నీటి కనెక్షన్‌ను కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే రద్దు చేసి, ఫిర్యాదుదారురాలి ఆడబిడ్డ పేరుపై కొత్త కనెక్షన్ మంజూరు చేశారని బాధితురాలు ఉప్పరపాలెం కు చెందిన భూ లక్ష్మి ఆరోపించారు.

ఈ విషయమై గతంలో కలెక్టరేట్ లో జరిగిన పీజీఆర్ఎస్‌లో కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దాదాపు 40 సంవత్సరాలుగా ఇంటి పన్నులు చెల్లిస్తున్నప్పటికీ ఇలాంటి చర్యలు తీసుకోవడం సమంజసం కాదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ హాసిని, ఫిర్యాదుదారురాలికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

## నేర నియంత్రణలో సాంకేతికతను సమర్థంగా వినియోగించాలి

**–వార్షిక తనిఖీల్లో పోలీసు అధికారులకు ఐజీ షానవాజ్ ఖాసిం దిశానిర్దేశం**
**–సీసీ కెమెరాలు, సైబర్ వ్యవస్థల వినియోగంపై ప్రత్యేక దృష్టి**

సంగారెడ్డి, జులై 24: (నేటినిజం ప్రతినిధి): నేరాలు జరిగిన తర్వాత వాటిని ఛేదిం చడం కంటే, నేరాలు జరగకుం డా ముందస్తు చర్యలు తీసుకోవ డమే పోలీసుల ప్రధాన బాధ్యత అని మల్టీ జోన్-2 ఐజీ షానవాజ్ ఖాసిం అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయం, ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ఐజీకి స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీతో కలిసి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. తర్వాత పునరుద్ధరించిన జిల్లా స్పెషల్ బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభించి వివిధ విభాగాల పనితీరును సమీక్షించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఐజీ మాట్లాడుతూ, అధిక నేరాలు నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాటిని జిల్లా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని సూచించారు. సైబర్ సెల్, ఐటీ సెల్ మరింత చురుకుగా పనిచేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

డీసీఆర్బీని జిల్లా నేర పరిశోధనకు వెన్నెముకగా అభివర్ణించిన ఆయన, రికార్డుల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.

సీసీటీఎన్ఎస్-2.0, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, సైబర్ క్రైమ్ పోర్టల్, సీఈఐఆర్, పాపిలాన్ ఫింగర్‌ప్రింట్ పరికరాలు వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలపై పూర్తి అవగాహన పెంపొందించుకుని నేర నియంత్రణలో సమర్థంగా వినియోగించాలని సూచించారు.

ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి నిర్ణీత గడువులోగా సీసీటీఎన్ఎస్‌లో అప్‌లోడ్ చేయాలని, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల వివరాలను నిరంతరం నవీకరిస్తూ ఉండాలని ఆదేశించారు. వర్షాకాలంలో వరదలు, చెరువులు, కుంటల వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుని, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

అనంతరం సంగారెడ్డి ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను సందర్శించిన ఐజీ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది బ్యారెక్స్‌ను పరిశీలించారు.

రోడ్డు ప్రమాదా లు, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణ కోసం కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఎస్పీలను ఆదేశించారు.మంచి పనితీరు కనబరిచిన పోలీసు సిబ్బందిని ఐజీ అభినం దిస్తూ రివార్డులు ప్రకటించారు.

# 'తల్లికి వందనం' లబ్ధిదారులతో సీఎం ముఖాముఖి..




అమరావతి, జులై 24: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం రంపచోడవరం చేరుకున్నారు. ప్రభుత్వ హైస్కూల్–జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విచ్చేసిన ఆయనకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. మంత్రి నారా లోకేష్‌తో పాటు 'తల్లికి వందనం' పథకం లబ్ధిదారులు కూడా ముఖ్యమంత్రికి స్వాగతం చెప్పారు.

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కలిసి సరస్వతి దేవి, అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 'తల్లికి వందనం' పథకం లబ్ధిదారులతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించారు. పథకం నిధులు వారి ఖాతాల్లో జమయ్యాయా అని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. దీనికి స్పందించిన తల్లులు తమ మొబైల్ ఫోన్లకు వచ్చిన నగదు జమ సందేశాలను ముఖ్యమంత్రికి చూపించారు.

ఈ పథకం ద్వారా అందిన ఆర్థిక సాయంతో తమ పిల్లలకు మెరుగైన విద్యను అందించగలుగుతున్నామని లబ్ధిదారులు తెలిపారు. కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ పథకం ప్రయోజనం అందించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. వరుసగా రెండో ఏడాది కూడా నిధులు జమ కావడంతో సంతోషంగా ఉందని సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌తో పంచుకున్నారు.

లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడిన ముఖ్యమంత్రి, ప్రభుత్వం అందిస్తున్న నిధులను పిల్లల విద్య కోసం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంత్రి నారా లోకేష్ మాటాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు.

## ఈ–కేవైసీ పూర్తి చేసుకోవాలి

ములుగు, జులై 24: (నేటినిజం ప్రతినిధి): రేషన్ కార్డులో నమోదైన లబ్ధిదారులంతా ఈ నెల 31వ తేదీలోగా త–కేవైసీ పూర్తి చేసుకోవాలని కలెక్టర్ బోర్కడ్ హేమంత్ సహదేవరావు ఒక ప్రకటలో తెలిపారు. రేషన్ షాపులకు వెళ్లి కార్డులో ఉన్న ప్రతి కుటుంబ సభ్యుడు ఈ–పాస్ యంత్రంపై తమ వేలిముద్రలను వేయాలని సూచించారు. ఈ–కేవైసీ పూర్తి చేయకపోతే రేషన్ బియ్యం సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

ములుగు, జులై 24: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు గాయాలైన ఘటన జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై గురువారం జరిగింది.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో జాతీయ రహదారి మీదుగా కళాశాలకు బోడ యశ్వంత్, మగ్గం సిద్ధార్థ, దాసరి రామ్‌చరణ్ స్కూటీపై బయల్దేరారు. యూటర్న్ తీసుకొని కళాశాల వైపు వెళ్తుండగా కారు ఢీకొట్టింది.

ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి.

సమాచారం మేరకు 108 అంబులెన్స్ చేరుకొని విద్యార్థులను చికిత్స కోసం ములుగు జీజీహెచ్‌కు తరలించారు.

## ఏదులాపురంలో బైక్‌ను ఢీకొన్న లారీ.. మెకానిక్ మృతి

ఖమ్మం, జులై 24:ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైపాస్ రోడ్డులోని బిలీఫ్ ఆస్పత్రి సమీపంలో ఓ బైక్‌ను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు.

ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని నామవరం గ్రామానికి చెందిన గోపీగా గుర్తించారు. అతను స్థానికంగా ఓ షోరూమ్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, బైక్‌పై యూటర్నింగ్ దాటుతున్న సమయంలో నాయుడుపేట వైపు నుంచి వేగంగా వచ్చిన లారీ గోపీని ఢీకొన్నట్లు ప్రత్యక్ష సాక్షులత తెలిపారు.

ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

## బాసరలో మాజీ రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ పూజలు




ఆదిలాబాద్, జులై 24:బిఆర్ఎస్ మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ శుక్రవారం మహారాష్ట్ర పర్యటనకు వెళుతుండగా బాసర వద్ద బిఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గ నాయకులు రమాదేవి, కిరణ్ కొమ్రేవార్, మండల అధ్యక్షుడు కోర్వ శ్యామ్, బి ఆర్ ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అనంతరం బాసర ఆలయంలో మాజీ రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ అమ్మవారిని దర్శించుకుని,బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు జన్మదినం సందర్భంగా అమ్మవారి సన్నిధిలో ఆయన పేరుపైన ప్రత్యేక కుంకుమార్చన పూజలు చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాజీ రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి, శాలువాతో సత్కరించారు.

# దేశవ్యాప్తంగా వర్షపాతం, నైరుతి రుతుపవనాల పరిస్థితిని క్రియాశీలకంగా పర్యవేక్షిస్తోన్న కేంద్ర హోం మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, జులై 24:దేశవ్యాప్తంగా వర్షపాతం, నైరుతి రుతుపవనాల పరిస్థితిని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ క్రియాశీలకంగా పర్యవేక్షిస్తోంది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా మార్గదర్శకత్వంలోని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ).. భారీ వర్షాల వల్ల తలెత్తుతున్న సమస్యలను ఎదుర్కొనేందుకు వీలుగా ప్రభావిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తోంది.

2026 జూలై నెలలో నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, అస్సాం, గుజరాత్, మహారాష్ట్ర, దాద్రా నగర్ హవేలీ, డామన్, జమ్మూ కాశ్మీర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడిన ఘటనలు నమోదయ్యాయి.

భారత వాతావరణ శాఖ (ఐఎండీ), కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఇన్‌కాయిస్) వంటి ఇతర కేంద్ర సంస్థలతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర, జిల్లా అత్యవసర ఆపరేషన్ కేంద్రాలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేసేందుకు హోం మంత్రిత్వ శాఖకు చెందిన 'ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూం' (ఐసీఆర్–ఈఆర్) నిరంతరం పనిచేస్తోంది.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, జిల్లాలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు అన్ని రక్షణ చర్యలను ఈ కంట్రోల్ రూం నిరంతరం పర్యవేక్షిస్తోంది.

ఈ ప్రాంతాలన్నింటిలోనూ మానవ ప్రాణ నష్టాన్ని నివారించేందుకు జాతీయ విపత్తు ప్రతిస్పందన బలగాలు (ఎన్‌డీఆర్ఎఫ్).. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాలు, రాష్ట్ర పోలీసు బలగాలు, ఎస్‌డీఆర్ఎఫ్‌లతో కలిసి నిరంతరం రక్షణ, సహాయక చర్యలలో పాల్గొంటున్నాయి.

ప్రతిస్పందన సమయాన్ని తగ్గించడానికి ఎన్‌డీఆర్ఎఫ్ తన బృందాలను ప్రమాదకర ప్రాంతాల్లో ముందస్తుగానే మోహరించింది. గడిచిన వారంలో ప్రభావితమైన అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 52 మందిని సురక్షితంగా రక్షించిన ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు 2,206 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాయి.

కేంద్ర హోం మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటూ?. చిక్కుకుపోయిన ప్రజలను కాపాడటానికి, సిబ్బందితో పాటు సహాయక సామగ్రి రవాణాలో రక్షణ సంస్థలకు సహకరించేందుకు, సహాయక సామగ్రిని పంపిణీ చేయడానికి రక్షణ మంత్రిత్వ శాఖ (ఎంఓడీ) అతి తక్కువ సమయంలోనే తన వనరులను సమకూర్చింది.

దేశవ్యాప్తంగా రుతుపవనాల కాలం కంటే ముందే 2026 మే 10న వరదలు, వడగాలుల విషయంలో సన్నాహక చర్యలపై కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. జమ్మూ కాశ్మీర్‌లో భారీ వర్షాలు, కుండపోత, వరదలు, కొండచరియలు విరిగిపడ్డ ఘటనల విషయంలో పూర్తి సన్నాహక చర్యలపై సమీక్షించేందుకు హోం మంత్రిత్వ శాఖ 2026 జూన్ 03న మరొక సమావేశాన్ని నిర్వహించింది.

ఛార్ ధామ్ యాత్రా మార్గంలో చేసిన ఏర్పాట్లపై కూడా హోం మంత్రిత్వ శాఖ క్రమం తప్పకుండా సమీక్షించింది.

కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా ఆదేశాల మేరకు ఎన్‌డీఆర్ఎఫ్ నిధుల విడుదల కోసం నష్ట తీవ్రతను అంచనా వేసేందుకు వివిధ మంత్రిత్వ శాఖలతో కూడిన కేంద్ర బృందాలు 2026 జూలై 07 నుంచి 10 వరకు అరుణాచల్ ప్రదేశ్, అస్సాంలోని ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికే పర్యటించాయి.

ఎడతెరిపి లేని వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి అంచనా వేయడానికి వివిధ మంత్రిత్వ శాఖలతో కూడిన మరొక కేంద్ర బృందం 2026 జూలై 25 నుంచి అస్సాంలోని ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనుంది.

ఇటీవలి వర్షాలు కొన్ని రాష్ట్రాల్లో ప్రజలకు ఇబ్బందులు కలిగించినప్పటికీ మొత్తం మీద ఇవి గతంలో అంచనా వేసిన దాదాపు 30 శాతం వర్షపాత లోటును సుమారు 15 శాతానికి తగ్గించాయి.

# 'బ్రిక్స్'కు భారత్ అధ్యక్షత–2026 కింద 'బ్రిక్స్' ఆరోగ్య మంత్రుల 16వ సదస్సు విజయవంతం

న్యూఢిల్లీ, జులై 24: 'బ్రిక్స్' కూటమికి భారత్ అధ్యక్షత–2026 కింద చండీగఢ్‌లో ఈ రోజు నిర్వహించిన ఆరోగ్య మంత్రుల 16వ శిఖరాగ్ర సదస్సు విజయవంతమైంది. సభ్యదేశాల్లో సమష్టి ప్రజారోగ్య ప్రాధాన్యాలపై దృష్టి సారించడంతోపాటు పటిష్ట ప్రపంచ ఆరోగ్య వ్యవస్థకు రూపకల్పనలో సహకార విస్తృతి లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహించారు. ఇందులో 'బ్రిక్స్' ఆరోగ్య మంత్రులు, ప్రతినిధి బృందాల అధిపతులు, సీనియర్ అధికారులు, ప్రజారోగ్య నిపుణులు పాల్గొన్నారు.

భారత్ నిర్దేశిత ఇతివృత్తం "పటిష్ట, వినూత్న, సహకారాత్మక, సుస్థిర వ్యవస్థ కోసం కృషి" ప్రాతిపదికన ఈ సదస్సు అనేక కీలక ప్రజారోగ్య సమస్యలపై లోతుగా చర్చించింది. అలాగే, "ఆరోగ్య వ్యవస్థల బలోపేతం, ఆవిష్కరణలకు ప్రోత్సాహం, మహమ్మారి నిరోధక సంసిద్ధత పెంపు, నిరంతర సహకారంతో సార్వత్రిక ఆరోగ్య భద్రత విస్తృతి" తదితరాలపై సమష్టి నిబద్ధతను పునరుద్ఘాటించే దిశగా సభ్య దేశాలకు ఒక వేదికగా నిలిచింది.

ఈ సదస్సుకు హాజరైన వారినుద్దేశించి కేంద్ర ఆరోగ్య–కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా వాస్తవిక సాదృశ మాధ్యమం ద్వారా ప్రధానోపన్యాసం చేశారు. ముందుగా బ్రిక్స్ సభ్యత్వ–భాగస్వామ్య దేశాల ఆరోగ్య మంత్రులు, ప్రతినిధి బృందాల అధిపతులు, సీనియర్ అధికారులను చండీగఢ్‌కు స్వాగతిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బ్రిక్స్‌కు భారత్ అధ్యక్షత వహించిన కాలమంతటా నిరంతర సహకారంపై ధన్యవాదాలు తెలిపారు. వర్ధమాన దేశాల మధ్య సహకార విస్తృతికి తోడ్పడే వేదికగా బ్రిక్స్ నిరంతర ప్రభావశీలతను సభ్య దేశాల చురుకైన భాగస్వామ్యం ప్రతిబింబిస్తుందని ప్రశంసించారు.

భారత్‌లో ఆరోగ్య సంరక్షణ రంగం పురోగమనాన్ని ప్రస్తావిస్తూ– "ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నేతృత్వాన కేంద్ర ప్రభుత్వం ఈ రంగం బలోపేతానికి విప్లవాత్మక సంస్కరణలు చేపట్టింది. ప్రజారోగ్య అవసరాలే పరమావధిగా విధానాల రూపకల్పన, ఆరోగ్య సంరక్షణ సేవల మెరుగుదల, సార్వజనీన డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పన, సేవా ప్రదాన వ్యవస్థల విస్తరణ వంటి అనేక చర్యలు తీసుకుంది" అని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి వివరించారు. ప్రపంచ దేశాల్లో ఆరోగ్య రంగ సుస్థిర ప్రగతి దిశగా పటిష్ట ప్రజారోగ్య వ్యవస్థలు, సార్వత్రిక ఆరోగ్య భద్రత అత్యంత అవశ్యమనే అంశాన్ని భారత్ అనుభవం మరింత ప్రస్ఫుటం చేసిందని ఆయన వ్యాఖ్యానించారు.

రెండు దశాబ్దాలుగా బ్రిక్స్ సాధించిన ప్రగతిని ప్రముఖంగా ప్రస్తావిస్తూ– వర్ధమాన దేశాల గళాన్ని శక్తిమంతంగా వినిపించిన కూటమిగా ఇది ఆవిర్భవించిందని శ్రీ నడ్డా గుర్తుచేశారు. మరింత సమ్మిళిత, సమాన ప్రపంచ వ్యవస్థను తీర్చిదిద్దే క్రమంలో ప్రభావశీల వేదికగా రూపొందిందని ఆయన పేర్కొన్నారు. అంటువ్యాధులు, అసాంక్రమిక వ్యాధుల భారం, వాతావరణ సంబంధిత ఆరోగ్య ముప్పులు, సాంకేతిక పురోగమన వేగం తదితర అంశాల్లో బహుపాక్షిక సహకారం సహా బలమైన సంస్థాగత భాగస్వామ్యాలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. "పటిష్ట, వినూత్న, సహకారాత్మక, సుస్థిర వ్యవస్థ కోసం కృషి" ఇతివృత్తంగా భారత్ ఈ సదస్సు నిర్వహించడాన్ని ప్రస్తావిస్తూ– మున్ముందు తలెత్తే ప్రజారోగ్య సవాళ్లను ముందుగానే పసిగట్టి, సమర్థంగా స్పందించే పటిష్ట ఆరోగ్య వ్యవస్థలను రూపొందించడంపైనే ప్రపంచ ఆరోగ్య భవిష్యత్తు ఆధారపడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా "సర్వే భవంతు సుఖినః, సర్వే సంతు నిరామయాః" (అందరూ సుఖంగా ఉండాలి... అందరూ ఆరోగ్యంగా ఉండాలి) అనే ప్రాచీన భారత శ్లోకాన్ని శ్రీ నడ్డా ఉటంకించారు. అనారోగ్యానికి చికిత్సతో సరిపెటడం కాకుండా, వ్యాధి నివారణ, సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ ప్రజారోగ్య వ్యవస్థ పరమోద్దేశంగా ఉండాలన్నారు.

'బ్రిక్స్' అధ్యక్ష హోదాలో ఆరోగ్య రంగంలో భారత్ ప్రాథమ్యాలను వివరిస్తూ– ప్రపంచ వ్యాప్త క్షయ వ్యాధి భారంలో దాదాపు సగం ఈ కూటమి దేశాలపైనే ఉందని శ్రీ నడ్డా గుర్తుచేశారు. అందువల్ల 'బ్రిక్స్ టీబీ రీసెర్చ్ నెట్‌వర్క్'ను మరింత బలోపేతం చేస్తే ఉమ్మడి పరిశోధనలు, నవ్యావిష్కరణలు, ఆచరణాత్మక అధ్యయనాలు వేగం పుంజుకోగలవని చెప్పారు. తద్వారా వినూత్న రోగనిర్ధారణ విధానాలు, చికిత్సలు, టీకాలు అందరికీ సమానంగా లభిస్తాయని, ప్రపంచ క్షయ నిర్మూలన లక్ష్య సాధనకు ఎంతగానో తోడ్పాటు లభిస్తుందని స్పష్టం చేశారు.

బ్రిక్స్ కూటమి దేశాల్లోని వైద్య ఉత్పత్తుల నియంత్రణ సంస్థల మధ్య సహకార బలోపేతం ఆవశ్యకతను ఆయన వివరించారు. ఇందులో భాగంగా బ్రిక్స్ దేశాల్లో ఉత్తమ పద్ధతులపై ('బ్రిక్స్ జీఎక్స్‌పీ') శ్వేతపత్రం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. నియంత్రణ నాణ్యత పెంపు, సమన్వయం, సామర్థ్య వికాసం సహా వైద్య ఉత్పత్తుల నాణ్యత–భద్రత–సమర్థతకు భరోసా దిశగా ఇదొక కీలక మలుపని ఆయన అభివర్ణించారు. భవిష్యత్ ఆరోగ్య అత్యవసర పరిస్థితులపై సన్నద్ధత ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తూ– అంటువ్యాధుల నివారణ –ప్రతిస్పందన దిశగా బ్రిక్స్ సమీకృత ముందస్తు హెచ్చరికల వ్యవస్థపై ఉప కార్యవర్గం ఏర్పాటు సహా దాని విధివిధానాలకు ఆమోదముద్ర వేయడాన్ని మంత్రి స్వాగతించారు. ప్రాంతీయ, అంతర్జాతీయ ఆరోగ్య భద్రత పటిష్టత దిశగా ఇదొక కీలక ఘట్టమని ఆయన పేర్కొన్నారు.

ఆరోగ్య సంరక్షణ రంగంలో డిజిటల్ సాంకేతికతల విప్లవాత్మక పాత్రను ప్రస్తావిస్తూ–ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, 'ఈ–సంజీవని' దూరవైద్య సంప్రదింపుల వేదిక ద్వారా భారత్ సముపార్జించిన అనుభవం సార్వజనీన డిజిటల్ మౌలిక సదుపాయాల అపార సామర్థ్యాన్ని నిరూపించిందని శ్రీ నడ్డా పేర్కొన్నారు. ముఖ్యంగా సుదూర, వైద్య సేవలు సవ్యంగా అందని ప్రాంతాల్లో అందరికీ ఆరోగ్య సేవల ప్రదానం–విస్తరణలో ఈ సదుపాయాల పాత్ర కీలకమని చెప్పారు.

సుదూర ప్రాంతాల్లో ఆరోగ్య సంరక్షణ సౌలభ్యం సహా నిరంతర సేవల దిశగా డిజిటల్ ఆరోగ్య వ్యవస్థపై బ్రిక్స్ సంకలనం ఆవిష్కరణపైనా శ్రీ నడ్డా హర్షం వ్యక్తం చేశారు. కూటమి దేశాల మధ్య సహకారం, ఉత్తమ పద్ధతుల ఆదానప్రదానం, పరస్పర అభ్యసన సౌలభ్యంలో ఇదొక విలువైన విజ్ఞాన వనరుగా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. జీవనశైలి వ్యాధులు, అసాంక్రమిక వ్యాధుల భారం పెరుగుతున్న నేపథ్యంలో నివారణ ప్రధాన ఆరోగ్య సంరక్షణపై నిశితంగా దృష్టి సారించాల్సి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఇందులో భాగంగా 'ఆరోగ్యకర జీవనశైలి కోసం బ్రిక్స్ మిషన్'తో పాటు 'ఆరోగ్యకర జీవనశైలి ప్రోత్సాహకాల సంయుక్త కార్యాచరణపై బ్రిక్స్ ప్రణాళికకు (2026–2029)' శ్రీకారం చుట్టడాన్ని ఆయన అభినందించారు. బ్రిక్స్ దేశాల్లో పౌష్టికాహారం, క్రమబద్ధ వ్యాయామం, సంప్రదాయ ఆహార సంస్కృతి పరిరక్షణ, నిదర్శనాధారిత ప్రవర్తనా మార్పును ఇవి ప్రోత్సహిస్తాయని స్పష్టం చేశారు.

సార్వత్రిక ఆరోగ్య సంరక్షణలో మానసిక ఆరోగ్యాన్ని అత్యంత కీలక స్తంభంగా శ్రీ నడ్డా పేర్కొన్నారు. సభ్య దేశాలలో పరిశోధనలను ముమ్మరం చేయడం, మానసిక ఆరోగ్యం దిశగా ప్రోత్సాహం, చికిత్స ప్రక్రియలలో అంతరాల తగ్గింపు లక్ష్యంగా 'నిమ్హాన్స్'కు సమన్వయ బాధ్యతలు అప్పగిస్తూ 'బ్రిక్స్ మానసికారోగ్య విశిష్ట కేంద్రాల నెట్‌వర్క్' ఏర్పాటును ఆయన ప్రకటించారు. దీంతోపాటు ఆరోగ్య సమానత్వం దిశగా శాస్త్రీయ సహకారం, ప్రజారోగ్య సమాచారం, బహుళరంగ చర్యలకు ఉద్దేశించిన శాశ్వత సంస్థాగత చట్రం 'ఆపరేషనల్ ఫ్రేమ్‌వర్క్ టు ఫైట్ ఎగైనెస్ట్ డిసీజెస్ డ్రివెన్ బై సోషల్ డిటర్మినెంట్స్ ఆఫ్ హెల్త్'కు ఆమోదం తెలపడాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. అలాగే 'బ్రిక్స్ నెట్‌వర్క్ ఆఫ్ నేషనల్ పబ్లిక్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్స్' పేరిట ఒక ఆచరణాత్మక చట్రానికి కూడా ఆమోదముద్ర పడిందని పేర్కొన్నారు. సహకారాత్మక పరిశోధనల బలోపేతం, అత్యావశ్య వైద్య ఉత్పత్తుల సమాన లభ్యత మెరుగుదల, బ్రిక్స్ న్యూక్లియర్ మెడిసిన్‌లో సహకారంపై చర్చలు, టీకాల పరిశోధన–అభివృద్ధి కేంద్రం కార్యకలాపాలకు నిరంతర చేయూత తదితరాలను కూడా మంత్రి ప్రస్తావించారు.

నిర్దిష్ట ప్రాధాన్య రంగాల్లో కూటమి దేశాల మధ్య ఉత్తమ విధానాల ఆదానప్రదానాన్ని శ్రీ నడ్డా అభినందించారు. అలాగే, డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ, ఆరోగ్యకర జీవనశైలి, మానసిక ఆరోగ్యం, ప్రజారోగ్యంపై సామాజికాంశాల ప్రభావంతో సంక్రమించే వ్యాధులు, జాతీయ ప్రజారోగ్య సంస్థలు వంటివాటిపై బ్రిక్స్ సంకలనాల పరంపర ఆవిష్కరణను స్వాగతించారు. ఈ విజ్ఞాన వనరులతో కూటమి దేశాల మధ్య పరస్పర అభ్యసన సౌలభ్యం కలుగుతుందని, దీంతోపాటు విస్తృత ప్రజారోగ్య చర్యలకు మద్దతు కూడా లభించగలదని ఆయన ఆశాభావం వెలిబుచ్చారు.

చివరగా– బ్రిక్స్ ఆరోగ్య మంత్రుల 16వ శిఖరాగ్ర సదస్సు ఏకగ్రీవ తీర్మానాన్ని ప్రస్తావిస్తూ– ఇది ఏకాభిప్రాయంతో రూపొందిన పత్రానికి పరిమితం కాదని, అంతకన్నా అమూల్యమైనదని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ జె.పి.నడ్డా అభివర్ణించారు. బ్రిక్స్ దేశాల మధ్య భవిష్యత్ సహకార విస్తృతి దిశగా శాశ్వత సంస్థాగత యంత్రాంగాల ఏర్పాటుకు ఇది దోహదం చేస్తుందన్నారు. వర్ధమాన దేశాల ఆకాంక్షలను గుర్తుచేస్తూ– మానవాళి శ్రేయస్సుకు తోడ్పడే సమ్మిళిత, సహకారాత్మక, సమానత్వ సహిత అంతర్జాతీయ ఆరోగ్య వ్యవస్థ దిశగా భారత్ దృక్కోణాన్ని ఆయన పునరుద్ఘాటించారు.

యావత్ ప్రపంచాన్ని ఒకే కుటుంబంగా పరిగణించే ప్రాచీన భారత తాత్త్విక సూత్రం "వసుధైవ కుటుంబకం" గురించి వివరిస్తూ– సకలజన ఆరోగ్య సౌభాగ్యం దిశగా సంఘీభావం, భాగస్వామ్యం, సమష్టి కర్తవ్య స్ఫూర్తితో ఏకతాటిపై కృషి చేయాలని బ్రిక్స్ దేశాలకు పిలుపునిస్తూ శ్రీ నడ్డా తన ప్రసంగం ముగించారు.

'బ్రిక్స్'కు భారత్ అధ్యక్షత కింద గుర్తించిన తొమ్మిది ప్రాధాన్య రంగాలపై మంత్రుల స్థాయి చర్చలు కేంద్రీకృతమయ్యాయి. సహకారం, విజ్ఞాన ఆదానప్రదానం ద్వారా ఆరోగ్య వ్యవస్థల బలోపేతం సహా కొత్త ప్రజారోగ్య సమస్యల పరిష్కారంపై సమష్టి నిబద్ధతను ఈ చర్చలు ప్రతిబింబించాయి.

క్షయ వ్యాధి నిర్మూలన కృషిని వేగిరపరచడంలో భాగంగా ఉమ్మడి పరిశోధన, నవ్యావిష్కరణలు, విజ్ఞాన ఆదానప్రదానాన్ని ప్రోత్సహించే 'బ్రిక్స్ టీబీ రీసెర్చ్ నెట్‌వర్క్'కు తమ చేయూతను సభ్య దేశాలు పునరుద్ఘాటించాయి. నియంత్రణ వ్యవస్థల బలోపేతం, చర్యల సమన్వయం సహా సురక్షిత, ప్రభావశీల, నాణ్యతకు భరోసా గల వైద్య ఉత్పత్తుల లభ్యత మెరుగుదల లక్ష్యంగా కూటమి వైద్య ఉత్పత్తుల నియంత్రణ సంస్థల మధ్య సహకార విస్తృతిపైనా మంత్రులు దృష్టి సారించారు. ప్రపంచ ఆరోగ్య భద్రత ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ– అంటువ్యాధుల నివారణ–ప్రతిస్పందనపై బ్రిక్స్ సమీకృత ముందస్తు హెచ్చరిక వ్యవస్థపై ప్రత్యేక ఉపకార్యవర్గం ఏర్పాటును మంత్రులు స్వాగతించారు. సభ్య దేశాలన్నిటా సహకారం, వ్యాధులపై నిఘా, సమాచార భాగస్వామ్యం, సమన్వయ సహిత ప్రజారోగ్య సంసిద్ధత, సత్వర ప్రతిస్పందన బలోపేతం తదితరాలకు ఉద్దేశించిన విధివిధానాలకు ఆమోదముద్ర వేశారు.

ఇక ప్రతినిధి బృందాల స్థాయి చర్చల సందర్భంగా– నిరంతర సంరక్షణ లక్ష్యంగా డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ బలోపేతం, పరస్పర సంధానిత వ్యవస్థలకు శ్రీకారం, సార్వజనీన డిజిటల్ మౌలిక సదుపాయాల ద్వారా మారుమూల–సవ్యంగా సేవలందని జనాభాకు నాణ్యమైన ఆరోగ్య సేవల ప్రదాన అవకాశాలపై దృష్టి సారించారు.

సార్వత్రిక ఆరోగ్య సంరక్షణలో మానసిక ఆరోగ్యాన్ని అంతర్భాగంగా గుర్తిస్తూ– మానవాళి మానసిక శ్రేయస్సు లక్ష్యంగా 'బ్రిక్స్ నెట్‌వర్క్ ఆఫ్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటుపై మంత్రులు హర్షం వెలిబుచ్చారు. ఈ వ్యవస్థకు భారత్‌లోని 'నిమ్హాన్స్' సంస్థ సమన్వయ నైపుణ్య కేంద్రంగా వ్యవహరిస్తుంది. మరోవైపు శిక్షణ, విజ్ఞాన–ఉత్తమ పద్ధతుల ఆదానప్రదానం ద్వారా మానవ వనరుల సామర్థ్య బలోపేతంపై బ్రిక్స్ శిక్షణ కేంద్రం నెట్‌వర్క్ ఏర్పాటును కూడా సభ్య దేశాలు ఆమోదించాయి. కూటమి దేశాలన్నిటా సహకారాత్మక పరిశోధన, విధాన చర్చలు, నిదర్శనాధారిత మానసిక ఆరోగ్య కార్యక్రమ వ్యూహాల రూపకల్పనకు ఇది ఎంతగానో తోడ్పడుతుంది.

నిదర్శనాల సమీకరణ, సహకారాత్మక పరిశోధన, విజ్ఞాన ఆదానప్రదానాల ద్వారా సంప్రదాయ, అనుబంధ, సమగ్ర వైద్య విధానాన్ని ప్రోత్సాహించే అంశాన్ని కూడా ఈ సదస్సు పునరుద్ఘాటించింది. ఈ నేపథ్యంలో 'బ్రిక్స్ హెల్త్ ట్రాక్' కింద ప్రాచీన, సంప్రదాయ వైద్య విధానాల (టీసీఐఎం)పై బ్రిక్స్ నిపుణుల కార్యవర్గం ఏర్పాటు ప్రతిపాదనను సభ్య దేశాలు స్వాగతిస్తూ, దాని విధివిధానాలను ఆమోదించాయి. కూటమి దేశాల మధ్య చర్చలు, సహకారం సహా ఉత్తమ పద్ధతుల ఆదానప్రదానంలో ఇదొక కీలక వేదిక కాగలదని అభిప్రాయపడ్డాయి.

కూటమి దేశాల్లోని స్థానిక పరిస్థితులకు తగిన విధంగా ఆరోగ్య సమానత్వం, సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ, సుస్థిర ప్రగతి లక్ష్యాల దిశగా సామూహిక కార్యాచరణను బలోపేతం ప్రాధాన్యాన్ని మంత్రులు గుర్తించారు. తదనుగుణంగా ప్రతిపాదించిన "సామాజికాంశాల ప్రభావిత వ్యాధులపై పోరుకు బ్రిక్స్ కార్యాచరణ చట్రా"నికి (డీడీ–ఎస్‌డీహెచ్) ఆమోద ముద్ర వేశారు. దీంతోపాటు పరస్పర గౌరవం, సమ్మిళితత్వం, సహకారం, సుస్థిరత సూత్రానుగుణంగా రూపొందించిన "బ్రిక్స్ జాతీయ ప్రజారోగ్య సంస్థల నెట్‌వర్క్ కార్యాచరణ చట్రా"న్ని కూడా ఆమోదించారు. దీనికింద విజ్ఞాన ఆదానప్రదానం, నిదర్శనాధారిత విధాన రూపకల్పన, సామర్థ్య వికాసం, సాంకేతిక తోడ్పాటుతో సంస్థాగత సహకార విస్తృతికి వీలుంటుంది.

'బ్రిక్స్ న్యూక్లియర్ మెడిసిన్' చట్రం అమలులో ప్రస్తుత సహకారాన్ని ప్రతినిధుల బృందాలు కూడా స్వాగతించాయి. సహకారాత్మక పరిశోధనల బలోపేతం, సురక్షిత, ప్రభావశీల టీకాల సార్వత్రిక లభ్యత మెరుగుదల కోసం 'బ్రిక్స్ టీకాల పరిశోధన–రూపకల్పన కేంద్రా'నికి మద్దతును పునరుద్ఘాటించాయి. ఈ సదస్సులో భాగంగా 'ఈట్ రైట్ ఇండియా' కార్యక్రమం కింద 'ఎఫ్ఎస్ఎస్ఏఐ' చిరుధాన్యాల వినియోగంపై నిర్వహించిన ప్రత్యక్ష ప్రదర్శన సహా 'ఎన్‌హెచ్ఏ', ఆయుష్ మంత్రిత్వ శాఖల ఎగ్జిబిషన్ కేంద్రాలను ఆరోగ్య మంత్రులు, ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గోష్ఠిలో డిజిటల్ ఆరోగ్యం, సంప్రదాయ వైద్యం, ఆహార భద్రత, ఆరోగ్యకర జీవనశైలి తదితరాల్లో భారత్ అమలు చేస్తునన కార్యక్రమాలను కూడా ప్రదర్శించారు.

# పోలీసు క్రీడలు జాతీయ ఐక్యతను బలోపేతం చేస్తాయి, ప్రతిభను ప్రోత్సహిస్తాయి: శ్రీ బండి సంజయ్ కుమార్

న్యూఢిల్లీ, జులై 24:గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న '11వ అఖిల భారత పోలీస్ జూడో క్లస్టర్?2026' క్రీడా పోటీలను కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ ఈరోజు ప్రారంభించారు.

ఈ సందర్భంగా కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ ప్రసంగించారు. దేశ నిర్మాణానికి, యువత సాధికారతకు సాధనంగా క్రీడలను భారత ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆయన అన్నారు. ఖేలో ఇండియా, ఆసియా క్రీడలు, ప్రపంచ పోలీసు?అగ్నిమాపక క్రీడలు తదితర కార్యక్రమాల ద్వారా దేశవ్యాప్తంగా క్రీడా మౌలిక వసతులను కేంద్రం విస్తరిస్తోందని చెప్పారు. కేంద్రం క్రీడల బడ్జెట్‌ను రూ. 4,480 కోట్లకు పెంచిందన్నారు. గతేడాది కేటాయింపుల కంటే ఇది రూ. 1,100 కోట్లకు పైగా అధికంగా ఉందని తెలియజేశారు. ప్రపంచ క్రీడాశక్తిగా ఎదగాలన్న భారత లక్ష్యాన్ని శ్రీ బండి సంజయ్ కుమార్ పునరుద్ఘాటించారు. 2047 నాటికి అయిదు అగ్ర క్రీడా దేశాల్లో ఒకటిగా మారాలన్న దేశ దీర్ఘకాలిక ఒలింపిక్ లక్ష్యం గురించి వివరించారు.

"ఇలాంటి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా ఉన్న పోలీసు సిబ్బందిని ఒకే వేదిక మీదకు తీసుకువస్తాయి. స్నేహాన్ని, పరస్పర అవగాహనను, సోదరభావాన్ని పెంపొందిస్తాయి. తద్వారా జాతీయ ఐక్యతను, దేశ సమగ్రతను బలోపేతం చేస్తాయి" అని ఆయన అన్నారు. పోలీసు క్రీడల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం గురించి కూడా ఆయన ప్రస్తావించారు. దీనిని సమ్మిళిత్వం, సాధికారత దిశగా వేసిన ముందడుగుగా వర్ణించారు. ఈ పోటీలు స్వర్ణం, రజతం, కాంస్య పతకాలను గెలవడం కోసం మాత్రమే కాదని అభిప్రాయపడ్డారు. "దేశభద్రతను కాపాడుతూ, కీలకమైన ప్రదేశాలకు రక్షణ కల్పిస్తూ, ప్రజాక్షేమం కోసం నిరంతరం శ్రమించే భద్రతా దళాలు, పోలీసుల జీవితాల్లో క్రీడలు విడదీయరాని భాగం" అని ఆయన తెలిపారు.

1969 నుంచి దేశంలో అత్యంత కీలమైన ఆస్తులకు, మౌలిక వసతులకు అవసరమైన భద్రతను సీఐఎస్ఎఫ్ అందిస్తోందని కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి చెప్పారు. వాటిలో విమానాశ్రయాలు, ఢిల్లీ మెట్రో, వారసత్వ కట్టడాలు, అణు, అంతరిక్ష సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, జైళ్లు, దేశ ప్రజాస్వామ్యానికి ప్రతీక అయిన పార్లమెంటు సముదాయం ఉన్నాయన్నారు. "ఇటీవలే జరిగిన ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో సీఐఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ అభిమన్యు స్వర్ణ పతకం సాధించారు. అంతర్జాతీయ రెజ్లింగ్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానాన్ని సాధించారు. ఇది మనందరికీ గర్వకారణం. ఇది క్రీడలకు సీఐఎస్ఎఫ్ ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. అయితే, ఇటీవలే సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం నాకు నిజంగా గర్వాన్ని కలిగించింది. అథ్లెట్ల సంక్షేమం కోసం అనేక ముఖ్యమైన కార్యక్రమాలను ఈ దళం చేపడుతోంది. సంక్షేమ పథకాలను విస్తరించింది. అథ్లెట్లకు ఇప్పుడు నేరుగా అదనపు ఆర్థిక సాయం లభిస్తోంది. నాణ్యమైన పోషకాహారం, ఆధునిక క్రీడా సామగ్రి లేదా గాయాల నుంచి త్వరగా కోలుకోవడానికి అవసరమైన సౌకర్యాల విషయంలో ఎలాంటి ఆటంకాలు ఎదురుకావు. ఈ చర్యలన్నీ మన అథ్లెట్లు తమ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించేందుకు, దేశానికి మరిన్ని విజయాలను తీసుకురావడానికి దోహదపడతాయి" అని ఆయన అన్నారు.

సీఐఎస్ఎఫ్ ఏడీజీ (సౌత్) పద్మాకర్ ఎస్ రన్విసే, సీఐఎస్ఎఫ్ ఏపీఎస్?ఎఎ ఐజీ ఎస్ఆర్ శరవణన్, సీఐఎస్ఎఫ్ ఐజీ, ఎన్ఐఎస్ఏ డైరెక్టర్ శ్రీమతి హర్‌ప్రీత్ కౌర్ సోహి, పీఐబీ ఏడీజీ శ్రీమతి శ్రుతి పాటిల్, ఇతర ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2026 జులై 23 నుంచి 30 వరకు 11వ అఖిల భారత పోలీస్ జూడో క్లస్టర్-2026 పోటీలు జరుగుతాయి. ఈ పోటీల్లో 36 రాష్ట్ర పోలీసు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సీఏపీఎఫ్) విభాగాలకు చెందిన 1,600 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారు. వీరు జూడో, వుషు, తైక్వాండో, కరాటే, పెన్చాక్ సిలాట్ క్రీడల్లో పోటీపడతారు.

# భారత్‌లో ఒకే విధమైన, ప్రభావశీల చట్ట రూపకల్పన ప్రక్రియ బలోపేతానికి శాసన సంబంధిత ముసాయిదాను సిద్ధం చేయడం కోసం 36వ బేసిక్ కోర్సు ఆరంభం

న్యూఢిల్లీ, జులై 24:శాసన సంబంధిత ముసాయిదాను సిద్ధం చేయడం కోసం ఉద్దేశించిన 36వ బేసిక్ కోర్సును చట్ట, న్యాయ శాఖకు చెందిన శాసన విభాగం, ఇనిస్టిట్యూట్ ఆఫ్ లెజిస్లేటివ్ డ్రాఫ్టింగ్ అండ్ రిసర్చ్ (ఐఎల్‌డీఆర్) ఆధ్వర్యంలో 2026 జులై 22న న్యూఢిల్లీ.. కర్తవ్య భవన్-02లో ఆరంభించారు. రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శాసన విభాగం, చట్ట వ్యవహారాల విభాగ కార్యదర్శి డాక్టర్ రాజీవ్ మణితో పాటు అదనపు కార్యదర్శి, ఐఎల్‌డీఆర్ కోర్సు డైరెక్టరు డాక్టర్ మనోజ్ కుమార్ సహా విభాగానికి చెందిన ఇతర సీనియర్ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా డాక్టర్ రాజీవ్ మణి మాట్లాడుతూ చట్టాలలో స్పష్టతను, స్థిరత్వాన్ని, చట్టపరమైన ఖచ్చితత్వాన్ని నిర్ధారించడానికి, మరీ ముఖ్యంగా క్షేత్ర స్థాయిలో శాసన సంబంధ సంస్కరణల కాలంలో ఒకే విధమైన శాసన సంబంధిత ముసాయిదాను రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. దీనివల్ల చట్టాలను ప్రభావవంతమైన రీతిలో అమలు చేయడానికి మార్గం సుగమం అవుతుందని ఆయన అన్నారు.

ఈ కోర్సు ఆరంభ కార్యక్రమాన్ని చేపట్టడం ద్వారా.. దేశవ్యాప్తంగా వ్యవస్థీకృత శిక్షణ, సామర్థ్యాల పెంపుదల కార్యక్రమాలను చేపడుతూ శాసన సంబంధిత ముసాయిదా రచన శక్తిని పటిష్ఠపరచాలన్న లెజిస్లేటివ్ డిపార్ట్‌మెంటు దీర్ఘకాలిక నిబద్ధతను పునరుద్ఘాటించినట్లయింది.

ఈ కోర్సును 2026 జులై 22 నుంచి సెప్టెంబరు 25 వరకూ నిర్వహిస్తారు. పదమూడు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి చెందిన 18 మంది ట్రయినీ ఆఫీసర్లు దీనిలో పాల్గొంటున్నారు. ఆ ట్రయినీ ఆఫీసర్లకు లెజిస్లేటివ్ డ్రాఫ్టింగులో అభ్యాసపూర్వక అనుభవాన్ని అందించడంతో పాటు, లెజిస్లేటివ్ డ్రాఫ్టింగుకు సంబంధించిన సూత్రాలపై అవగాహనను పెంచడం ఈ కోర్సు ముఖ్యోద్దేశం. దీంతో వారు శాసన సంబంధిత ముసాయిదా రూపకల్పనకు అవసరమైన జ్ఞ?నాన్నీ, నైపుణ్యాలనూ సంపాదించుకోగలుగుతారు.

ఈ కార్యక్రమ నిర్వహణతో శాసన సంబంధ ముసాయిదా రూపకల్పనలో ఏకరూపతనూ, ఖచ్చితత్వాన్నీ, శ్రేష్ఠత్వ సాధననూ మరింతగా ప్రోత్సహించవచ్చని ఆశిస్తున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాల సంస్థాగత సామర్థ్యాన్ని పటిష్ఠపరచడం కూడా సాధ్యపడుతుందని భావిస్తున్నారు.

# సిరిపురం గ్రామపంచాయతీకి 500 కేఎల్‌డీ నమూనా వికేంద్రీకృత సమీకృత వ్యర్థజలాల శుద్ధి కేంద్రాన్ని అప్పగించిన సీఎస్ఐఆర్ - ఐఐసీటీ

న్యూఢిల్లీ, జులై 24:సుస్థిర గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సాంకేతికత ఆధారిత సామాజిక సాధికారత దిశగా ఒక విజయాన్ని సూచిస్తూ, హైదరాబాద్ లోని సీఎస్ఐఆర్ - భారత కెమికల్ టెక్నాలజీ సంస్థ (సీఎస్ఐఆర్?ఐఐసీటీ) తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా సిరిపురం గ్రామపంచాయతీకి 500 కేఎల్‌డీ సామర్థ్యం గల నమూనా వికేంద్రీకృత సమీకృత మురుగునీటి శుద్ధి (ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ -ఈటీపీ) కేంద్రాన్ని అధికారికంగా అప్పగించింది. ఈ కేంద్రం ద్వారా వస్త్రాల రంగు అద్దకం పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ జలాలతో పాటు ఇళ్ల నుంచి వెలువడే మురుగునీటిని కూడా శుద్ధి చేస్తారు.

సీఎస్ఐఆర్ - ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనివాసరెడ్డి స్వాగతోపన్యాసం చేస్తూ, "సిరిపురం నమూనా వికేంద్రీకృత మురుగునీటి శుద్ధి కేంద్రం శాస్త్రీయ ఆవిష్కరణలతో పర్యావరణ సమస్యలకు పరిష్కారం చూపడమే కాకుండా, గ్రామీణ ప్రజల జీవనోపాధిని మెరుగుపరచగలదని నిరూపిస్తోంది. ఇది 'ల్యాబ్ టు లూమ్' కార్యక్రమానికి నిదర్శనం. ఇది దేశీయ పరిశోధనా ఫలితాలను చేనేత రంగానికి ఉపయోగపడే ఆచరణాత్మక, సుస్థిర పరిష్కారంగా మలిచిన కార్యక్రమం. దేశంలోని వివిధ జౌళి, చేనేత పరిశ్రమల సముదాయాల్లో ఈ నమూనాను అమలు చేసే అవకాశం ఎంతో ఉందని మేం భావిస్తున్నాం. ఇది నీటి సంరక్షణ, కాలుష్య నివారణతో పాటు సుస్థిర గ్రామీణాభివృద్ధికి కూడా గణనీయంగా దోహదపడుతుంది" అని ఆయన పేర్కొన్నారు.

సీఎస్ఐఆర్ - ఎన్ఈఈఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎస్. వెంకట మోహన్ మాట్లాడుతూ, సంక్లిష్టమైన వస్త్ర రంగులు, సేంద్రీయ కాలుష్య కారకాలను సమర్థవంతంగా విచ్ఛిన్నం చేసేందుకు ఈ శుద్ధి వ్యవస్థలో అనేక జీవక్రియ మార్గాలను ఆధునిక బయో ఎలక్ట్రో క్యాటలైటిక్ ప్రక్రియలతో సమన్వయం చేసినట్లు వివరించారు. తక్కువ విద్యుత్ వినియోగం, కనిష్ఠ రసాయనాల వినియోగం, వనరుల సంరక్షణ, నీటి పునర్వినియోగం వంటి సూత్రాల ఆధారంగా ఈ వ్యవస్థను రూపొందించారు. పర్యావరణ ఇంజినీరింగ్, బయోటెక్నాలజీ రంగాల్లోని ఆధునిక సాంకేతికతలను క్షేత్రస్థాయిలో అమలు చేయగల సమర్థవంతమైన పరిష్కారాలుగా మలిచి, కాలుష్య నియంత్రణ, నీటి భద్రత, సర్క్యులర్ ఎకానమీ లక్ష్యాలను సాధించేందుకు ఇది దోహదపడుతుందని నిరూపిస్తోంది. దేశంలో వందల సంఖ్యలో చేనేత, వస్త్ర పరిశ్రమల క్లస్టర్లు ఉన్నాయని, వాటిలో అనేక ప్రాంతాలు రంగుల అద్దకం, ఇతర ప్రాసెసింగ్ కార్యకలాపాల ద్వారా వెలువడే మురుగునీటి నిర్వహణలో సవాళ్లను ఎదుర్కొంటున్నాయని డాక్టర్ మోహన్ వివరించారు. అందువల్ల సిరిపురం ఈటీపీ నమూనాను గురుత్వాకర్షణ ఆధారిత, రసాయన రహిత, శక్తి సామర్థ్యంతో కూడిన విధానంలో అభివృద్ధి పరిచారు. దేశంలోని వస్త్ర, చేనేత పరిశ్రమల క్లస్టర్లలో అమలు చేసేందుకు, స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్చుకునేందుకు విస్తృత అవకాశాలున్న ఆదర్శ ప్రదర్శన కేంద్రంగా ఇది రూపుదిద్దుకుంది.

500 కేఎల్‌డీ సామర్థ్యం గల ఈ శుద్ధి కేంద్రం సమగ్ర హైబ్రిడ్ జీవ శుద్ధి విధానాన్ని ఉపయోగిస్తుంది. ఇందులో అనేక జీవక్రియ మార్గాలను ఆధునిక బయో ఎలక్ట్రో క్యాటలైటిక్ ప్రక్రియలతో సమన్వయం చేసి మురుగునీటి శుద్ధి చేపడుతున్నారు. ఈ స్థాయిలో బయో ఎలక్ట్రో క్యాటలైటిక్ ప్రక్రియలను సమన్వయం చేయడం ద్వారా, వస్త్ర పరిశ్రమల వ్యర్థ జలాలనూ, గృహ మురుగు నీటినీ కలిపి శుద్ధి చేసే సాంకేతికతకు ఇది క్షేత్రస్థాయిలో ఒక ముఖ్యమైన నమూనాగా నిలుస్తోంది.

ఈ శుద్ధి కేంద్రం ద్వారా స్థానిక పర్యావరణ పరిస్థితులు మెరుగుపడటంతో పాటు, సుస్థిర జీవనోపాధులకు తోడ్పాటుతో సిరిపురం గ్రామంలోని దాదాపు 7,000 మంది ప్రజలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రయోజనం పొందుతారని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా మురుగునీటి వల్ల భూమి, జల వనరులు కలుషితం కాకుండా నివారించడంతో పాటు పారిశుద్ధ్యం, పర్యావరణ నాణ్యత మెరుగుపడుతాయని భావిస్తున్నారు. అలాగే మంచినీటి వనరులపై ఆధారపడటాన్ని తగ్గించి, సంప్రదాయ చేనేత కార్యకలాపాలకు పర్యావరణ పరంగా మరింత సుస్థిరతను అందించడంలో ఇది సహాయపడనుంది. ముఖ్యంగా ఈ కార్యక్రమం పర్యావరణ బాధ్యత కలిగిన వస్త్ర ఉత్పత్తిగా పోచంపల్లి వస్త్రాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో దోహదపడుతుంది. భవిష్యత్‌లో సుస్థిరత ధ్రువీకరణ, పర్యావరణ అనుకూల గుర్తింపు పొందే ప్రయత్నాలకు ఇది తోడ్పాటు అందించడంతో పాటు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో పోచంపల్లి వస్త్రాల విలువనూ , పోటీతత్వాన్నీ పెంచే అవకాశం ఉంది.

# మెగా పేరెంట్-టీచర్ మీట్‌కు విశేష స్పందన




అమరావతి, జులై 24:మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌ల ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలల మధ్య బలమైన అనుబంధం ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య సమన్వయం అత్యంత కీలకమని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఇందిరా గాంధీ స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 4.0 కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల చదువు, ప్రవర్తన, అభ్యాస పురోగతిని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులతో చర్చించి తెలుసుకోవాలని సూచించారు. పిల్లలు ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి, వారిని మెరుగైన స్థాయికి తీసుకెళ్లేందుకు సంయుక్తంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. లీప్ యాప్ ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, బోధించిన సిలబస్, మిగిలిన పాఠ్యాంశాలు, విద్యార్థుల ప్రగతి నివేదికలు, పాఠశాల మౌలిక వసతుల వివరాలు తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. తల్లిదండ్రులు తమ అభిప్రాయాలు, సూచనలు, ఫిర్యాదులను కూడా ఈ యాప్ ద్వారా నమోదు చేయవచ్చని వివరించారు.

విద్యార్థుల నాణ్యమైన విద్య, మానసిక ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ చెప్పారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం నాలుగు ఆటిజం కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు "నైపుణ్యం" పోర్టల్ అందుబాటు లోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఈ పోర్టల్‌లో నమోదు చేసుకుని ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు న్నారు.

2024 వార్షిక కార్యాచరణ ప్రణాళిక కింద జిల్లాలోని 100 పాఠశాలల్లో 235 అభివృద్ధి పనులకు రూ.34 కోట్లు వెచ్చిసున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదనపు తరగతి గదులు, డ్యూయల్ డెస్కులు, భవనాల పెయింటింగ్, మరుగుదొడ్లు, తాగునీటి కోసం ఆర్.ఓ. ప్లాంట్ల ఏర్పాటు వంటి పనులు సుమారు 1,400 పాఠశాలల్లో కొనసాగుతున్నాయని చెప్పారు. జిల్లాలో ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. గత మెగా డీఎస్సీ ద్వారా జిల్లాకు సుమారు 2,000 మంది ఉపాధ్యాయులను కేటాయించారని, ప్రస్తుతం ఉన్న 1,600 ఖాళీలను కూడా రాబోయే మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు.

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన బోధన, సమర్థవంతమైన ఉపాధ్యాయులు, మెరుగైన మౌలిక వసతులతో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నిలుస్తున్నాయని, ప్రజల్లో ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం గణనీయంగా పెరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు.

కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రోజా పాఠశాల పురోగతిని వివరించగా, జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్ విద్య ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం తల్లిదండ్రులు, విద్యార్థులు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద ప్రత్యేక మెనూతో ఏర్పాటు చేసిన భోజనాన్ని స్వీకరించారు. భోజనం అనంతరం లెమన్ స్పూన్, మ్యాజికల్ చైర్స్ వంటి వినోదాత్మక పోటీలు నిర్వహించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి 'తల్లికి వందనం' కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జంతర్ మంతర్‌కు దూరంగా ఉండండి: ఢిల్లీ యూనివర్సిటీ

న్యూ ఢిల్లీ, జులై 24:నీట్, ఇతర పరీక్షల ప్రశ్నపత్రాలపై సీజేపీ ఢిల్లీలో చేపట్టిన ఆందోళనకు దేశ వ్యాప్తంగా మద్దతు లభిస్తుంది. జంతర్ మంతర్ వద్ద ఇంకా నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసనల్లో పాల్గొనవద్దని ఢిల్లీ యూనివర్సిటీ తన విద్యార్థులకు సూచించింది. అదేవిధంగా నకిలీ వార్తలు, ఏదైనా సమాచారం షేర్ చేసేముందు అప్రమత్తంగా ఉండాలని యూనివర్సిటీలోని అన్ని శాఖలకు తెలిపింది. జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసనలను సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నియంత్రిస్తారని వెల్లడించింది. ఇలాంటి కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొంటే న్యాయపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.ఔవలిబ

ఈ చట్టపరమైన చర్యల వల్ల విద్యార్థుల భవిష్యత్తుకు ఆటంకం కలుగుతుందని, వృత్తిపరమైన అవకాశాలపై ప్రభావం పడుతుందని వెల్లడించింది. అదేవిధంగా వ్యక్తిగత భద్రతకు కూడా ముప్పు వాటిల్లే అవకాశం ఉందని, అందుకే వాటికి దూరంగా ఉండాలని పేర్కొన్నది. నకిలీ వార్తలు పెరిగిపోతున్నాయని, ఏదైనా సమాచారాన్ని పంచుకునే ముందు, దానిపై స్పందించే ముందు ఆ సమాచారంపై పూర్తి అవగాహన ఉండాలని, జాగ్రత్త వహించాలని సూచించింది.

పాకిస్తాన్ సోషల్ మీడియాల నిలిపివేత

ఈ ఆందోళనల నేపథ్యంలో తప్పుదోవ పట్టించే సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్న పాకిస్తాన్ సోషల్ మీడియాలను నిలిపివేశామని ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. ఆ దేశానికి చెందిన సుమారు 480 సోషల్ మీడియా అకౌంట్లను బ్లాక్ చేశామని వారు తెలిపారు. ఆ దేశ సోషల్ మీడియా ఖాతాలు తప్పుడు సమాచారాన్ని, తప్పుదోవ పట్టించే పోస్టులను వ్యాప్తి చేసస్తూ తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని అన్నారు. ఇలాంటి నిజం కాని కంటెంట్‌కు దూరంగా ఉండాలని, వాటికి బలి కావద్దని వారు సూచించారు.

# ఒకేసారి మూడు నెలల బియ్యం

నల్గొండ, జులై 24:ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని కేంద్రప్రభుత్వం మరోమారు నిర్ణయించింది.

ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలలకు సంబంధించిన రైస్‌ను లబ్ధిదారులకు ప్రభుత్వం ఒకేసారి ఇవ్వనున్నారు. దీని కోసం జిల్లా పౌరసరఫరా అధికారులు రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా ప్రక్రియను చేపట్టారు. ఆగస్టులో మూడు నెలలకు సంబం ధించిన బియ్యాన్ని రేషన్‌కార్డు దారులకు ఇవ్వనున్నారు.

మహబూబాబాద్ జిల్లాలోని 18మండలాల్లో 558 రేషన్ షాపులు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతీనెల 5,200 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. దీనికి గాను ప్రతీనెల 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపులు తెరిచి ఉంటాయి. కానీ, ఆగస్టులో మాత్రం 22 రోజు లు షాపులు తెరిచి ఉంటాయని పౌరసరఫరా అధికారులు తెలిపారు. ఓటీపీ, ఎఫ్ఆర్ఎస్ విధానంలో బియ్యం పంపిణీ జరుగుతుంది. జిల్లాలో 2,78,712 రేషన్ కార్డుల్లో 8,23,423 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి గాను ప్రతీ ఒక్కరికి 6 కిలోల చొప్పున 18 కిలోల బియ్యం అందజేయనున్నారు.

## తరం మారుతుంది, స్వరం మారుతుంది..

# మోదీ జెన్‌జెడ్‌తో పెట్టుకున్నావు జాగ్రత్త : కేటీఆర్

హైదరాబాద్, జులై 24:తరం మారుతుంది, స్వరం మారుతుంది..జెన్‌జెడ్‌తో(ఉవని-జి) ప్రధాని మోదీ(ఖఓఓనీటతి) జాగ్రత్తగా ఉండు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. బర్త్ డే వేడుకలను సైతం రద్దు చేసుకుని, నల్ల చొక్కాతో ఆయన నిరసన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..

నేపాల్‌లో యువత తలుచుకుంటే ప్రభుత్వమే కూలిపోయిందని గుర్తు చేశారు. ఈడీ, సీబీఐలకు భయపడి సోనమ్ వాంగ్‌చుక్ దీక్షను ఒక్క మీడియా సంస్థ కూడా చూపించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ విద్యార్థులు మాకు సోషల్ మీడియా ఉందని ధైర్యంగా పోరాడుతున్నారు. కేంద్రంపై నిరసన కోసం వస్తుంటే మధ్యలో కాంగ్రెస్ వాళ్లు మమ్మల్ని అడ్డుకున్నారు. బడే భాయ్ కోసం చోటే భాయ్ అడ్డం పడుతున్నాడు. మోదీని అంటే ఈ కేడీ గాడికి ఏం అయింది. ఢిల్లీలో రాహుల్ గాంధీ పోయి మోదీ ఇంటి ముందు కూర్చుంటే.. ఈ నల్లమల పిల్లి పోయి కొడంగల్‌లో దాక్కున్నది అని ఎద్దేవా చేశారు.

రేవ్ కేసులలో బీజేపీ నాయకుల కొడుకులకు బెయిల్ వస్తుంది కానీ మాకు న్యాయం ఎందుకు జరగడంలేదని విద్యార్థులు అడుగుతున్నారు. 8 మంది బీజేపీ ఎంపీల్లో ఎవరైనా ఆ ప్రశ్నకు సమాధానం చెప్తారా? అని ప్రశ్నించారు. మాట్లాడితే బీజేపీ వాళ్లు దేశం కోసం ధర్మం కోసం అంటారు. దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్న ఈ పిల్లలు హిందువులు కాదా? అని నిలదీశారు. అవసరమైతే మీకోసం కేసీఆర్ కూడా వస్తాడు. ఆయన సోషల్ మీడియాలో మీ ఆందోళన చూసి తల్లడిల్లిపోతున్నాడని తెలిపారు. పిల్లలే దేశ ముఖచిత్రాన్ని మారుస్తారు, వాళ్లే ఈ దేశాన్ని కాపుడుకుంటారని కరోనా సమయంలోనే కేసీఆర్ చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# శాస్త్రీయ నిర్ధారణ ఆధారంగా ఈ20 పెట్రోల్ భద్రత, పనితీరును ధ్రువీకరించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, జులై 24:ఇథనాల్ మిశ్రమ పెట్రోలు (ఈబీపీ) కార్యక్రమం పూర్తి స్థాయి శాస్త్రీయ విశ్లేషణ, క్రమబద్ధమైన సంప్రదింపులతో అమలులోకి వచ్చింది. నీతి ఆయోగ్, ఆటోమొబైల్ తయారీదారులు, చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు), ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ), సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మ్యానుఫ్యాక్చరర్స్ (ఎస్ఐఏఎం), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం (ఐఐపీ), ఇతర సాంకేతిక సంస్థల భాగస్వామ్యంతో దశలవారీగా ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారు.

ఇథనాల్ కొత్త ఇంధనమేమీ కాదు. శతాబ్దానికి పైగా ప్రపంచవ్యాప్తంగా దీని వినియోగం ఉనికిలో ఉంది. బ్రెజిల్ వంటి దేశాలు దశాబ్దాలుగా అత్యధిక శాతంలో ఇథనాల్ మిశ్రమాన్ని ఉపయోగిస్తున్నాయి. భారత్‌లో 2001లో ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమం ప్రారంభం కాగా.. 2006లో ఈ5ను ప్రవేశపెట్టారు. 2013-14 నాటికి ఇథనాల్ మిశ్రమం 1.53 శాతం వద్ద మాత్రమే ఉండేది. ఆ తర్వాత అవసరమైన ఉత్పాదక సామర్థ్యం, మౌలిక సదుపాయాలు, నిబంధనల వ్యవస్థను బలోపేతం చేస్తూ క్రమంగా దీని శాతాన్ని పెంచుతూ వచ్చారు.

అధిక శాతం ఇథనాల్ మిశ్రమాల పంపిణీకి ముందే విస్తృత స్థాయి సమీక్షలు జరిగాయి. ఆటోమొబైల్ తయారీదారులు, ఎస్ఐఏఎం, ఏఆర్ఏఐ, వాహన విడిభాగాల తయారీదారులు, పరీక్షా సంస్థలు, చమురు మార్కెటింగ్ కంపెనీలతో సమగ్రంగా చర్చించిన తర్వాతే ఈ విధానాన్ని మార్కెట్‌లోకి తీసుకువచ్చారు.

ఈ-20 పెట్రోల్ వాడకం వల్ల ఇంధన సామర్థ్యం, ఇంజిన్ పనితీరు, నిర్వహణ ఖర్చులు, డ్రైవింగ్ అనుభవంపై వాహన తయారీదారులు, ఆటోమొబైల్ సంఘాలు, వినియోగదారుల సంస్థల నుంచి ఎలాంటి విస్తృతమైన లేదా ఆధారాలతో కూడిన ఫిర్యాదులూ ప్రభుత్వానికి అందలేదు. ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియాలో వ్యక్తమైన కొన్ని అనుమానాలను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయంగా దీనిని పరిశీలించింది. ఏఆర్ఏఐ, ఎస్ఐఏఎం, ఐఓసీఎల్, ఐఐపీ, వాహన తయారీ సంస్థలు కలసి విస్తృత స్థాయి ప్రయోగశాల పరీక్షలు, క్షేత్రస్థాయి పరీక్షలు నిర్వహించాయి. ఇంజిన్ మన్నిక, వాహన ప్రయాణ శైలి, స్టార్టింగ్ సామర్థ్యం, తుప్పు పట్టకుండా ఉండే గుణం, విడిభాగాల అనుకూలత, ఉద్గారాలు, ఇంధన సామర్థ్యం వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశోధించాయి. నిర్ణీత ప్రమాణాల ప్రకారం ఈ-20 పెట్రోల్ వాడకం పూర్తి సురక్షితమని ఈ అధ్యయనాలు స్పష్టం చేశాయి.

పాత తరం వాహనాల పనితీరులో తీవ్ర వ్యత్యాసాలు గానీ, విడిభాగాల అసాధారణ అరుగుదల గానీ జరగడం లేదని ఈ పరిశోధనలు తేల్చాయి. విస్తృత ప్రయోగశాల పరీక్షలు, క్షేత్రస్థాయి పరిశీలనలు, నిజరూప వినియోగ అనుభవాలు... దేనిలోనూ ఈ-20 ఇంధనం వల్ల వాహనాల పనితీరుపై పెద్ద ప్రతికూల ప్రభావం పడలేదని స్పష్టమైంది.

ప్రభుత్వ అంచనాలు కేవలం ప్రయోగశాల పరిశోధనలకే పరిమితం కాలేదు. దేశవ్యాప్తంగా అమలు చేసిన తర్వాత కూడా లభించిన విస్తృత అనుభవం ఆధారంగా రూపుదిద్దుకున్నాయి. దేశంలో ప్రతిరోజూ సుమారు 8 కోట్ల వాహనాలు పెట్రోల్ బంకులకు వస్తుంటాయి. వీటిలో దాదాపు 80 శాతం పెట్రోలు వాహనాలే ఉన్నాయి.

ఈ15 ప్లస్ మిశ్రమ పెట్రోలు గత మూడేళ్లన్నర కాలంగా, ఈ19-ఈ20 ఇంధనం రెండేళ్లన్నరగా వినియోగంలో ఉన్నాయి. దేశంలో 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఈ మిశ్రమ ఇంధనంతో నడుస్తున్నాయి. ఇథనాల్ మిశ్రమం వల్ల ఇంజిన్ వైఫల్యం లేదా వాహనాలు నిలిచిపోవడం వంటి ఆధారాలు ఎక్కడా లభించలేదు. ఈ20 ఇంధనం వల్ల ఎలాంటి అసాధారణ తుప్పు, అరుగుదల లేదా వాహన జీవితకాలం తగ్గడం లేదని వాహన తయారీదారుల సర్వీస్ డేటా ధ్రువీకరించింది. ఈ20 ఇంధనాన్ని ఉపయోగిస్తున్న వాహనాలకు తయారీదారులు వారంటీ సదుపాయాన్ని కొనసాగిస్తుండటం ఈ ఇంధన సురక్షత, విశ్వసనీయతపై మరింత నమ్మకాన్ని పెంచుతోంది.ఒక ప్రముఖ వాహన తయారీ సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సరంలో 2.84 కోట్ల వాహనాలకు సర్వీసింగ్ నిర్వహించింది.

# తెలుగు సాహిత్యానికి ఇంద్రగంటి ఎనలేని సేవలు

## జూలై 25...ఇంద్రగంటి శ్రీకాంత శర్మ వర్ధంతి

తెలుగు సాహితీ ప్రపంచంలో సుపరిచితులైన సాహితీవేత్త ఇంద్రగంటి శ్రీకాంతశర్మ. ఆయన స్పృశించని సాహితీ ప్రక్రియ దాదాపు లేదనే చెప్పాలి. పండిత వంశంలో జన్మించి, సాహితీ వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని, సినిమా పాటలు రాసిన కవిగా, పండితునిగా, కథా రచయితగా, పత్రికా సంపాదకునిగా, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ ప్రత్యేక గుర్తింపు పొందారు.

తూర్పు గోదావరి జిల్లా, రామచంద్ర పురంలో శ్రీకాంత శర్మ మే 29 1944 న జన్మించారు. ఆయన తండ్రి ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి కవి గొప్ప కవి. తెలుగు పొట్టి కథలకు "కథానిక" అనే అద్భుతమైన పేరు సూచించి, ఆ సాహితీ ప్రక్రియకు ఒక సమున్నత స్థానాన్ని కల్పించిన హనుమచ్ఛాస్త్రి గొప్ప కవి

కావడం మూలాన, చిన్ననాటి నుండే సాహిత్య వాతావరణంలో పెరిగిన శ్రీకాంత శర్మ, విద్యార్థి దశలోనే రచనా వ్యాసంగం చేపట్టారు. తెలుగులో ఎం. ఏ. పట్టభద్రులై, తర్వాత అభ్యుదయ కవిగా శర్మ పేరొందారు.

అనేక లలిత గేయాలు కవితలు, సాహిత్య వ్యాసాలతో పాటు రేడియో నాటికలు, నాటకాలు, డాక్యుమెంటరీలు, సంగీత రూపకాలను రచించారు. జన్మనిచ్చిన పితృ దేవుల వారసత్వాన్ని నిలబెట్టడంతో పాటు, అర్థవంతమైన రచనలెన్నో చేసి, సాహితీ ప్రియుల హృదయాలలో చెరగని ముద్ర వేశారు శ్రీకాంత శర్మ. అపురూపమైన భావావేశం సొంతం చేసుకొని, ఆవేశాన్నైనా, ఆవేదననైనా అక్షరాల్లో లయబద్ధంగా అమర్చ గలగడం, పాఠకుల మనసులతో పాటు, మెదళ్ళనీ రచనల ద్వారా కదిలించ గలగడం శ్రీకాంత శర్మ ప్రత్యేకతలు.



పలు తెలుగు సినిమాల్లో ఆయన పాటలు రాశారు. 'కృష్ణావతారం', 'నెలవంక', 'రావుగోపాలరావు', 'రెండుజెళ్ల సీత', 'పుత్తడిబొమ్మ', 'చైతన్యరథం' వంటి చిత్రాల్లో శ్రీకాంత శర్మ పాటలు రాశారు. తన కుమారుడు ఇంద్రగంటి మోహనకృష్ణ తెరకెక్కించిన 'సమ్మోహనం' సినిమాలోనూ ఆయన పాటను రాశారు.

ఆంధ్రజ్యోతి వారపత్రికలో ఉప సంపాదకులుగా ఉద్యోగ జీవితం మొదలు పెట్టినా, కొంతకాలం సినిమా రంగంలో పని చేసినా, ఆలిండియా రేడియోలో అడుగు పెట్టాకనే శ్రీకాంతశర్మ సృజనాత్మకత పూర్తిగా రెక్కలు విప్పుకుంది. ఆయన రచించిన ఎన్నో సంగీత రూపకాలు జాతీయ స్థాయిలో బహుమతులు అందుకున్నాయి. ఆయన రచించిన లలిత గీతాలు ఈనాటికీ బహుళ ప్రాచుర్యంలో ఉన్నాయి. తెలుగు నాటక రంగానికీ, తెలుగు సాహిత్య రంగానికీ ఆయన చేసిన కృషి ఎన్నదగినది.

1976లో ఆకాశవాణి విజయవాడ కేంద్రంలొ అసిస్టెంట్ ఎడిటర్ గా శర్మ చేరాడు. తెలుగు ప్రసంగాల శాఖకు ప్రముఖ ఆధ్యాత్మిక ప్రాసంగికులు ఉషశ్రీకి సహాయకునిగా సంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు. శర్మ వివిధ పత్రికలలో గేయాలు, కవితలు, సాహిత్యవ్యాసాలు వ్రాశారు. అనేక రేడియో నాటికలు, నాటకాలు, డాక్యుమెంటరీలు, సంగీత రూపకాలు రచించారు. రేడియో ప్రసంగాలు చేశాడు. 1994లో ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ గా నిజామాబాద్ కేంద్రంలో పని చేశాడు. 1995లో స్వచ్ఛంద పదవీ విరమణ చేసి ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక సంపాదకులుగా చేరారు.

1977లో అనుభూతి గీతాలు కవితా సంపుటికి ఫ్రీవర్స్ ఫ్రంట్ పురస్కారం, 1979లో నూతలపాటి సాహితీపురస్కారం, 1981లో ఆకాశవాణి వార్షిక పోటీలలో అమరామరం డాక్యుమెంటరీకి ప్రథమ బహుమతి, 1981లో ఆకాశవాణి వార్షిక పోటీలలో వర్షానందిని సంగీత రూపకానికి ప్రథమ బహుమతి, 1986లో ఆకాశవాణి వార్షిక పోటీలలో నేనుకాని నేను సృజనాత్మక రూపకానికి ప్రథమ బహుమతి, 1988లో ఆకాశవాణి వార్షిక పోటీలలో మాటా - మౌనం సంగీత రూపకానికి ప్రథమ బహుమతి, 1988లో ఆకాశవాణి వార్షిక పోటీలలో నిశ్శబ్దగమ్యానికి ద్వితీయ బహుమతి, 1990లో ఆకాశవాణి వార్షిక పోటీలలో మెట్లకు ద్వితీయ బహుమతి, తదితరాలు సొంతం చేసుకున్నారు.

ఆయన సతీమణి ఇంద్రగంటి జానకీబాల ప్రముఖ రచయిత్రి. నవలా రచయిత్రిగా, రేడియో కళాకారిణిగా, లఘు కథల రచయిత్రిగా, కవయిత్రిగా సుపరిచితులు.

కుమార్తె కిరణ్మయి కూడా లఘు చిత్రాలు తీస్తూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చు కున్నారు. కుమారుడు ఇంద్రకంటి మోహన కృష్ణ సినీ దర్శకునిగా మంచి గుర్తింపు పొందారు. దర్శకునిగా ఆయన తొలి చిత్రం

2004లో గ్రహణంకు భారత జాతీయ చలన చిత్ర పురస్కారం, ఉత్తమ నూతన దర్శకులుగా నంది పురస్కారంతో పాటు ఆ సినిమాకు 11 అవార్డులు దక్కడం విశేషం. 2006లో మాయాబజార్, 2008 లో అష్టా చమ్మా, 2011లో గోల్కొండ హైస్కూల్, 2013లో అంతకు ముందు ఆ తర్వాత ( ఉత్తమ కథా రచయిత గా నంది అవార్డు), 2015లో బందిపోటు, 2016లో జెంటిల్ మాన్, 2017 లో అమీతుమీ, 2018లో సమ్మోహనం, 2020లో వి. తదితర చిత్రాలలో తన ప్రతిభను చాటారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

---

## నామాల రవీంద్రసూరికి సినారె సాహితీ పురస్కారం



సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామానికి చెందిన కవి, సినీ దర్శకుడు నామాల రవీంద్రసూరికి 2026 సంవత్సరానికి గాను ప్రతిష్మాత్మక పద్మభూషణ్, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా. సి. నారాయణరెడ్డి (సినారె) స్మారక సాహితీ పురస్కారం ప్రకటించారు. మహాకవి సినారె 95వ జయంతిని పురస్కరించుకొని సినారె కళాపీఠం, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ఆగస్టు 2న హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం సెమినార్ హాల్‌లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు సినారె కళాపీఠం అధ్యక్షులు మల్లెకేడి రాములు వెల్లడించారు. ఈ ప్రతిష్మాత్మక పురస్కారానికి తనను ఎంపిక చేసిన ఎంపిక కమిటీ సభ్యులకు, సినారె కళాపీఠం అధ్యక్షులు మల్లెకేడి రాములు గారికి రవీంద్రసూరి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవాన్ని తన వ్యక్తిగత విజయంగా కాకుండా సాహిత్యానికి లభించిన గుర్తింపుగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## గర్రెపల్లి పీఏసీఎస్ చైర్మన్ గా కల్లేపల్లి జానీ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, జులై 24: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గా కల్లేపల్లి జానీ శుక్రవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. సభ్యులుగా రమేష్, రాజశేఖర్ రెడ్డి, రాజిరెడ్డి, రమ, రాజిరెడ్డి, చక్రధర్, సరోజన, రాజు, తిరుపతి, రాజమల్లు, స్వరూప, పెద్ద రాజయ్య బాధ్యతలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా చైర్మన్ జానీ మాట్లాడుతూ అందరి సహకారంతో సంఘం సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. రైతుల అభ్యున్నతికి పాటు పడతానన్నారు. అనంతరం చైర్మన్ తో పాటు పాలకవర్గాన్ని పలువురు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఈవో నవీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## న్యూఢిల్లీలో సమగ్ర రక్షణ, విమానయాన, విమానాశ్రయ మౌలిక సదుపాయాల ఆతిథ్యం

హైదరాబాద్, జూలై 22: సెప్టెంబర్ 10-12 తేదీలలో న్యూఢిల్లీలోని యశోభూమి - ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్, ఎక్స్‌పో సెంటర్ లో నిర్వహించనున్న AEDEX + AIRPORT 2026 ప్రదర్శనలు, రక్షణ, ఏరోస్పేస్, విమానయాన, విమానాశ్రయ మౌలిక సదుపాయాల రంగాలకు ప్రపంచ స్థాయి సమావేశ వేదికగా భారత్‌ను నిలబెట్టనున్నాయి. ఈ మూడు రోజుల అంతర్జాతీయ ప్రదర్శనలు సదస్సులు విధాన రూపకర్తలు, ప్రపంచ సాంకేతిక సంస్థలు, రక్షణ తయారీ సంస్థలు, విమానాశ్రయ అభివృద్ధి సంస్థలు, పెట్టుబడిదారులు పరిశ్రమ నాయకులను ఒకే వేదికపైకి తీసుకురానున్నాయి. భారత్ ఏరోస్పేస్, రక్షణ తయారీ విమానయాన రంగాల్లో ప్రపంచ శక్తిగా ఎదుగుతున్న నేపథ్యంలో, సెప్టెంబర్ 10 2026 న ప్రారంభమయ్యే AEDEX + AIRPORT లో ప్రముఖ రక్షణ సంస్థలు, ఏరోస్పేస్ తయారీదారులు, సాంకేతిక ఆవిష్కర్తలు, విధాన రూపకర్తలు, పరిశోధనా సంస్థలు, అంతర్జాతీయ పరిశ్రమ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొననున్నారు. AEDEX + AIRPORT ఇంటర్నేషనల్ ఎక్సిబిషన్స్ ఉ కాన్ఫరెన్స్ 2026 రక్షణ తయారీ సంస్థలు, ఏరోస్పేస్ కంపెనీలు, ప్రభుత్వ సంస్థలు, సాయుధ దళాలు, పరిశోధనా సంస్థలు, సాంకేతిక సంస్థలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థలు ప్రపంచ పెట్టుబడిదారులకు అత్యాధునిక సాంకేతికతలను ప్రదర్శించడానికి, వ్యూహాత్మక భాగస్వామ్యాలను నెలకొల్పడానికి, కొత్త వ్యాపార అవకాశాలను అన్వేషించడానికి ఒక ప్రధాన వేదికగా రూపొందించబడింది. ఈ కార్యక్రమాలకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, వాణిజ్య ఉ పరిశ్రమల మంత్రిత్వ శాఖ, ఏం ఎస్ ఏం ఈ మంత్రిత్వ శాఖ, డి ఆర్ డి ఓ (రక్షణ మంత్రిత్వ శాఖ), డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ అలాగే మేక్ ఇన్ ఇండియా స్టార్ట్ -అప్ ఇండియా కార్యక్రమాల మద్దతు లభిస్తోంది. అదనంగా ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా , డ్రోన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా , ఎయిర్ కార్గో ఫోరమ్ ఇండియా వంటి ప్రముఖ పరిశ్రమ సంస్థలు కూడా మద్దతు అందిస్తున్నాయి. మేక్ ఇన్ ఇండియా మరియు ఆత్మనిర్భర్ భారత్ వంటి కేంద్ర ప్రభుత్వ ప్రధాన కార్యక్రమాల ప్రభావంతో భారత ఏరోస్పేస్ రక్షణ రంగం అపూర్వమైన మార్పును చవిచూస్తోంది. స్వదేశీ తయారీ, సాంకేతిక ఆవిష్కరణలు, ప్రైవేట్ రంగ భాగస్వామ్యం ఎగుమతుల పోటీతత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వం పలు సంస్కరణలు చేపట్టింది.

## నడుముపై 27 కేజీల బరువుతో 847 పుష్‌అప్స్.. భారతీయుడి వరల్డ్ రికార్డ్..

న్యూఢిల్లీ, జులై 24: హర్యానాకు చెందిన 41 ఏళ్ల రోహితాష్ చౌదరీ అనే వ్యక్తి గంటలో 847 పుష్‌అప్స్ తీసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నాడు. అది కూడా నడుపై 27.21 కిలోల బరువును ఉంచుకుని 847 పుష్‌అప్స్ తీసి ప్రపంచ రికార్డు సృష్టించాడు. రోహితాష్ స్టోరీ ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. కొన్నేళ్ల క్రితం అతడు యాక్సిడెంట్ కారణంగా మంచానికి పరిమితమయ్యాడు. రెండేళ్ల పాటు నాలుగు గోడల మధ్య నలిగిపోయాడు. అయితే, విల్ పవర్‌తో మళ్లీ నడవటం మొదలెట్టాడు. ప్రపంచ రికార్డులు బ్రేక్ చేసే దిశగా అడుగులు వేశాడు. 'పుష్‌అప్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా గుర్తింపు తెచ్చుకున్నాడు. ప్రతీ ఏటా కొత్త రికార్డు సృష్టిస్తున్నాడు. తాజా విజయంతో వరుసగా పదో సారి ప్రపంచ రికార్డును బ్రేక్ చేశాడు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేసింది. ఆ వీడియోలో.. రోహితాష్ నడుముపై 27 కేజీల బరువుతో ఎంతో కష్టపడి గంటలో 847 పుష్‌అప్స్ తీశాడు. సిరియాకు చెందిన సామి జోమా హాస్సన్ పేరు మీద ఉన్న రికార్డును బ్రేక్ చేశాడు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారులు రోహితాష్‌కు సర్టిఫికెట్ అందించారు.

## విద్యా వ్యవస్థకు ఉపాధ్యాయులే వెన్నెముక: సీఎం చంద్రబాబు

అమరావతి, జులై 24: పిల్లలు ఆనందంగా చదువుకోవడానికి ఏర్పాట్లు చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రంపచోడవరంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల కొరత లేదన్నారు. విద్యా వ్యవస్థకు ఉపాధ్యాయులే వెన్నెముక అని అన్నారు. తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులను ప్రయోజకులుగా చేయడం టీచర్ల బాధ్యతన్నారు. పిల్లలందరికీ పౌష్టికాహారం ఇస్తున్నామని తెలిపారు. పీ4 కార్యక్రమంలో పేదవారిని ఆదుకునేలా కృషి చేస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో పిల్లలే ఆస్తి అని సీఎం తెలిపారు.

పిల్లలు పుడితే భారం కాదని.. ఆదాయంగా మార్చేశామని ముఖ్యమంత్రి చెప్పారు. ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం డబ్బులు ఇస్తున్నామన్నారు. 67 లక్షల మంది పిల్లలకు రూ.10,120 కోట్లు జమ చేస్తున్నామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లోనే 5 లక్షల మందికి రూ.664 కోట్లు జమ చేస్తున్నామన్నారు. గిరిజనులకు ఐఐటీలో ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. ఆగస్టు నుంచి సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ప్రతి ఇంటికీ సోలార్ ఉచితంగా ఇస్తామని తెలిపారు. ఆర్థిక అసమానతలు తగ్గించి జీవన ప్రమాణాలు పెంచుతామని వెల్లడించారు. పది లక్షల కోట్లు అప్పులు ఉన్నా.. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. విద్య పైనే ఎక్కువ దృష్టి సారించినట్లు తెలిపారు.

## భారతీయ పెట్టుబడిదారులు..

### 'వైవర్ ఆఫ్ ప్రీమియం' పై అవగాహన కలిగి ఉండాలి

### పాలసీబజార్ లైఫ్ ఇన్సూరెన్స్ సీబీఓ వివేక్ జైన్

policybazaar.com HAR FAMILY HOGI INSURED

హైదరాబాద్, జులై 23:'భారతీయ పెట్టుబడిదారులు పిల్లల చదువు, పెళ్లి, రిటైర్మెంట్ జీవితంలోని ముఖ్యమైన లక్ష్యాల కోసం ఇన్సూరెన్స్ ప్లాన్లలో పెట్టుబడి పెడుతుంటారు. అయితే, భవిష్యత్తులో ప్రీమియంలు చెల్లించడానికి పాలసీదారుడు బతికి లేకపోతే ఆ లక్ష్యాల పరిస్థితి ఏమిటనే ప్రశ్నను చాలా మంది విస్మరిస్తున్నారు, ఈ విషయంలో 'వైవర్ ఆఫ్ ప్రీమియం' ఫీచర్ రక్షణగా నిలుస్తుందని పాలసీబజార్ లైఫ్ ఇన్సూరెన్స్ సీబీఓ వివేక్ జైన్ తెలిపారు. ఇది కేవలం సంపదను సృష్టించడమే కాకుండా, సంపాదించే వ్యక్తి లేకపోయినా కుటుంబ ఆశయాలకు ఎటువంటి అంతరాయం లేకుండా నెరవేరేలా చూస్తుందన్నారు. చాలా కుటుంబాలలో ఆర్థిక ప్రణాళిక క్రమశిక్షణ, నిరంతరాయంగా కొనసాగడం అనే అంశాలపై ఆధారపడి ఉంటుందన్నారు. ఒక నెలవారీ ఎస్ఐపీ, దీర్ఘకాలిక పెట్టుబడి ప్రణాళిక లేదా రిటైర్మెంట్ నిధి వంటివన్నీ కూడా రాబోయే సంవత్సరాల్లో లేదా దశాబ్దాల పాటు ఆదాయం ఎటువంటి అంతరాయం లేకుండా వస్తానే ఉంటుందనే ఊహతో రూపొందించుకుంటారన్నారు. జీవితం ఎప్పుడూ మనం అనుకున్నట్లే సాగదన్నారు. ఇక్కడ ఒక ఉదాహరణ.. 'కుమార్ ఒక ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయంలో తన బిడ్డ పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువు కోసం ఆర్థికంగా సిద్ధం కావాలనుకుంటున్నారు. 20 ఏళ్ల కాల పరిమితిని మనసులో ఉంచుకుని, 15 శాతం సీఏజీఆర్ వృద్ధి రేటును ఊహిస్తూ, రెండు దశాబ్దాలలో దాదాపు కోటి నిధిని సమకూర్చుకోవాలనే లక్ష్యంతో ఆయన సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (ఎస్ఐపీ) ద్వారా ప్రతి నెలా రూ.10,000 పెట్టుబడి పెట్టడం ప్రారంభించారు. ఈ ప్లానింగ్ బాగానే ఉంది. పెట్టుబడి మొత్తం, కాల పరిమితి ఖరారైంది, లక్ష్యం కూడా స్పష్టంగా ఉంది. కానీ, పూర్తిగా ఆలోచించని ఒక విషయం ఉంది. ఒకవేళ ఈ ఎస్ఐపీ మధ్యలోనే అకస్మాత్తుగా ఆగిపోతే ఏమవుతుంది' అని తెలిపారు.

## విద్యార్థులను దేశ శత్రువులుగా మోదీ ప్రభుత్వం పరిగణిస్తోంది: సోనియా గాంధీ

న్యూఢిల్లీ, జులై 24:నిరసన చేస్తున్న విద్యార్థులను దేశ శత్రువులుగా మోదీ ప్రభుత్వం పరిగణిస్తోందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ విమర్శించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను బహిరంగంగా తోసిపుచ్చడం ద్వారా జవాబుదారీతనం పట్ల ధిక్కారాన్ని ప్రదర్శించారని ఆరోపించారు. నీట్ లీక్ వివాదంపై విద్యార్థుల ఆందోళనలు, కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును విమర్శిస్తూ సోనియా గాంధీ రాసిన ఒక ఆర్టికల్ 'ది హిందూ' పత్రికలో శుక్రవారం ప్రచురితమైంది. విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం, విద్యా సంస్కరణలను విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. అయితే మోదీ ప్రభుత్వం వారి ధైర్యానికి పిరికితనంతో, విచక్షణారహిత క్రూరత్వంతో స్పందించిందని, విద్యార్థులను భవిష్యత్తు వారసులుగా కాకుండా దేశ శత్రువులుగా చూస్తోందని ఆరోపించారు.



కాగా, జులై 20న ఢిల్లీ పోలీసులు, సాయుధ పోలీస్ బలగాల లాఠీచార్జ్, బాష్పాయువు ప్రయోగం వంటి హింసాత్మక చర్యల ద్వారా విద్యార్థుల నిరసనలను అణచివేసేందుకు ప్రయత్నించడం కేంద్ర ప్రభుత్వం 'అవఖ్యాతి పాలైన రోజు'గా సోనియా గాంధీ అభివర్ణించారు. కేంద్ర హోం మంత్రి ఆధ్వర్యంలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది విద్యార్థి నిరసనకారులపై ప్రదర్శిస్తున్న 'క్రూరత్వం' ఈ ప్రభుత్వ హయాంలో కొత్తేమీ కాదన్నారు. '2020లో సీఏఏ-ఎన్ఆర్సీ వ్యతిరేక నిరసనల సమయంలో సాయుధ పోలీసులు, పారామిలిటరీ బలగాలు విశ్వవిద్యాలయ ప్రాంగణాలను ఎలా ధ్వంసం చేశాయో మనందరికీ స్పష్టంగా గుర్తుంది. భారత మహిళా రెజ్లర్లపై జరిగిన ఆమోదయోగ్యం కాని దురాగతాలను మన జ్ఞాపకాల నుంచి ఎప్పటికీ చెరిపివేయలేం' అని పేర్కొన్నారు.

మరోవైపు విద్యార్థుల నిరసనలను బలహీనపర చడానికి, అసమ్మతిని దేశద్రోహంగా ముద్ర వేసే పాత 'సాధనాలను' కేంద్ర ప్రభుత్వం తిరిగి ఉపయోగించినట్లు సోనియా గాంధీ విమర్శించారు. నిరసనలకు దారితీసిన తన విధానాలపై ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన మోదీ ప్రభుత్వం, నిందలు వేయడానికి, కుట్రలను ప్రచారం చేయడానికి తన కుతంత్రాలన్నింటినీ ప్రయోగించిందని దుయ్యబట్టారు.

భారతదేశ విద్యా రంగాన్ని కేంద్ర ప్రభుత్వం క్షీణింపజేస్తోందని సోనియా గాంధీ విమర్శించారు. కేవలం నిరాశను మాత్రమే కలిగించే నేటి నిరాశాజనకమైన విద్యా వాతావరణం, మోదీ ప్రభుత్వానికి అలవాటైన అహంకారం, జవాబు దారీతనం లేదా నిర్మాణాత్మక వైఖరి లేకపోవడం అనే ఈ పరస్పర సంబంధిత శక్తుల సహజ పర్యవసానమే విద్యార్థుల నిరసనలని స్పష్టం చేశారు. దేశ విద్యార్థులు మోదీ ప్రభుత్వ బూటకపు మాటలను బట్టబయలు చేశారని పేర్కొన్నారు.

కాగా, ప్రభుత్వ విద్య నుంచి మోదీ ప్రభుత్వం వెనకడుగు వేయడమే మొట్టమొదటి ప్రాథమిక సమస్య అని సోనియా గాంధీ అభిప్రాయపడ్డారు. పాఠశాల విద్యపై తన మొత్తం బడ్జెట్‌లో కేటాయించే వాటాను 50 శాతం, ఉన్నత విద్యపై 33 శాతం తగ్గించిందని విమర్శించారు. 'ఇంతటి అసంబద్ధమైన వెనకడుగులో ఎవరికైనా అర్థం కనిపిస్తుందా' అని ప్రశ్నించారు.

అలాగే గత 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం దాదాపు లక్ష ప్రభుత్వ పాఠశాలలను మూసివేసి, 43,000 ప్రైవేట్ పాఠశాలల ప్రారంభాన్ని పర్యవేక్షించిందని సోనియా గాంధీ ఆరోపించారు. వీటిలో అధిక భాగం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో నడుస్తున్నాయని తెలిపారు. 'యాదృచ్ఛికంగా, ఈ సంస్థ తన అనుబంధ సంస్థలతో కలిసి భారతదేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ పాఠశాలల నెట్‌వర్క్‌ను నిర్వహిస్తోంది' అని విమర్శించారు. నాణ్యమైన, సరసమైన ప్రభుత్వ విద్య అందుబాటులో లేకపోవడంతో దేశంలోని కుటుంబాలు తమ పిల్లల చదువుల కోసం సొంతంగా డబ్బు ఖర్చు చేయవలసి వస్తోందని పేర్కొన్నారు.

అయితే ఎన్టీఏను బలోపేతం చేయాలన్న పార్లమెంటరీ విద్యా స్థాయీ సంఘం సిఫార్సులను, అందులో ప్రతిపక్ష సభ్యులు ఉన్నారనే ఏకైక కారణంతో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బహిరంగంగా తోసిపుచ్చడం ద్వారా జవాబుదారీతనం పట్ల ధిక్కారాన్ని ప్రదర్శించారని సోనియా గాంధీ ఆరోపించారు. ఇన్ని ఘోర వైఫల్యాలు ఎదురైనా పదవికి రాజీనామా చేయడానికి ఆయన విముఖత చూపడం ప్రజాభిప్రాయాన్ని మరింత రెచ్చగొట్టిందని అన్నారు. విద్యార్థులకు అండగా నిలబడి, వారి భవిష్యత్తును కాపాడటం ఒక నైతిక, రాజకీయ, రాజ్యాంగపరమైన బాధ్యత అని స్పష్టం చేశారు.

## గౌతమ్ మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో వన మహోత్సవం

### - మొక్కలు నాటిన విద్యార్థులు

రాజన్న సిరిసిల్ల, జులై 24:(నేటినిజం ప్రతినిధి): పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు వేములవాడ పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం వనమహోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించారు. విద్యార్థులు పట్టణ ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించి పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేశారు. "చెట్లను నాటుదాం- పర్యావరణాన్ని కాపాడుదాం", "ఒక్కో మొక్క-రేపటి ప్రగతికి బాట" అంటూ చేసిన నినాదాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ర్యాలీ అనంతరం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి నీడనిచ్చే, పూలు, పండ్ల మొక్కలను నాటారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మెహందీ వేడుకలను కూడా నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని చేతులకు మెహందీ అలంకరించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బూర ఉమా రమేష్ మాట్లాడుతూ భావి తరాల భవిష్యత్తు కోసం పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థుల్లో చెట్ల పెంపకంపై చైతన్యం కల్పించేందుకు ర్యాలీ, మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అలాగే, సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేందుకు ఆషాఢ మాసం సందర్భంగా మెహందీ వేడుకలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ హరికిషన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై విమర్శలు సహించం

### - కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూమ్ మధు

### బీజేపీ ఇంటి ముట్టడి హెచ్చరికపై కాంగ్రెస్ నేతల ఖండింపు




రాజన్న సిరిసిల్ల, జులై 24: (నేటినిజం ప్రతినిధి): ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై బీజేపీ నాయకులు చేసిన ఇంటి ముట్టడి హెచ్చరికను వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే మద్దతుగా నిలుస్తుంటే రాజకీయ విమర్శలు చేయడం సరికాదని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూమ్ మధు అన్నారు. విద్య, ఆరోగ్యం, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే పనిచేస్తున్నారని, ముడిపెల్లిలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనాన్ని ప్రారంభించిన నాయకుడిపై విమర్శలు చేయడం తగదన్నారు. బీజేపీ నాయకులు తమ ధోరణి మార్చుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తూమ్ మధు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, ఆత్మ కమిటీ చైర్మన్ ముసుకు ముకుందరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కో-ఆప్షన్ సభ్యులు కట్కూరి శ్రీనివాస్, పీర్ మహమ్మద్, పులి రాంబాబు, పొద్దుపొడుపు లింగారెడ్డి గౌడ్, కూరగాయల కొమురయ్య, చిలుక రమేష్, కౌన్సిలర్లు ఎల శ్రీనివాస్, తోట రాజు, కొండ శేఖర్, సిరిగిరి శ్రీకాంత్, రామతీర్థపు హరీష్, ఖమ్మం గణేష్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: BAISA DEVADAS.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.